



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 51 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | మంగళవారం 28 అక్టోబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :51 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | TUE 28 OCTOBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## విశాఖలో భారీ వర్షం.. చెరువులను తలపిస్తున్న రోడ్లు

మొంథా తుపాను ప్రభావంతో విశాఖ నగరంలో భారీ వర్షం కురుస్తోంది. పలు చోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. కైలాసపురంలో గాలుల ప్రభావానికి చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని జీవీఎంసీ అధికారులు ప్రజలను సూచించారు.



## ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం



- మొంథా తుఫానుపై అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం
- జీరో క్యాజువాలిటీ లక్ష్యంతో సహాయక చర్యలు ముమ్మరం
- 19 జిల్లాల్లో 40 లక్షల మందిపై ప్రభావం అంచనా
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ప్రజల తరలింపు
- రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు
- అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ప్రజలకు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా "జీరో క్యాజువాలిటీ" లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఐటీ, మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, ప్రభుత్వ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని

వివరాలు 2లో..

# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

## ప్రధాని మోదీ ఫోన్, యంత్రాంగానికి కీలక ఆదేశాలు

- మొంథా తుపానుపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- సీఎంకు ఫోన్ చేసి వివరాలు అడిగిన ప్రధాని మోదీ
- కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైన తుపాను
- రాత్రికి తీరం దాటే అవకాశం ఉందని అంచనా
- కృష్ణా జిల్లాకు అతి భారీ వర్ష సూచన
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. సీఎం చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కూడా చంద్రబాబుకు ఫోన్ చేసి తుపాను పరిస్థితిపై ఆరా తీశారు.ప్రస్తుతం మొంథా తుపాను కాకినాడకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గంటకు 16 కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోందని, రేపు రాత్రికి తీరాన్ని తాకే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. తుపాను ప్రభావంతో ఈరోజు, రేపు కృష్ణా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతీ గంటకు తుపాను కదలికలను గమనిస్తూ, వర్షాలు, వరదలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పంట నష్టం జరగకుండా

వివరాలు 2లో..

రష్యా నుంచి చమురు కొనుగోలు..

## ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం



- ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోదేశం పట్ల అమెరికా ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని విమర్శ
- నీతులు చెప్పేవారు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శ
- ఆసియాన్ సదస్సులో జైశంకర్ వ్యాఖ్యలు

వివరాలు 2లో..

## తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి



- మొంథా తుపానుపై కాకినాడ జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- తీరం దాటనున్న నేపథ్యంలో 12 మండలాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- ప్రాణ నష్టం నివారణే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టాలని కీలక ఆదేశాలు
- గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టమైన సూచనలు
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, మందులు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం
- తుపాను సహాయక చర్యల కోసం కాకినాడకు రూ. కోటి అత్యవసర నిధి విడుదల

వివరాలు 2లో..

## 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..




- 'ఎస్ఐఆర్'పై కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- బీహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైందన్న ప్రధాన ఎన్నికల కమిషనర్
- రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తామని వెల్లడి
- 21 ఏళ్ల కింద ఓటర్ల జాబితా సవరణ జరిగిందన్న జ్ఞానేశ్ కుమార్

పెన్ పవర్ డెస్క్:ఎస్ఐఆర్ ప్రత్యేక సమగ్ర సవరణ)పై కేంద్ర ఎన్ని కల సంఘం సోమవారం కీలక ప్రకటన చేసింది. బీహార్‌లో

వివరాలు 2లో..

తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో

## భయభ్రాంతులకు గురిచేయొద్దు



- మొంథా తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సన్నద్ధం
- తుపాను వార్తలపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలన్న అనిత
- తప్పుడు థంబ్‌నెయిల్స్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని స్పష్టం
- సంచలన హెడ్డింగులతో గందరగోళం సృష్టించడం చట్టవిరుద్ధమని వెల్లడి

వివరాలు 2లో..

## విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్



- నకిలీ మద్యం కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని జోగి రమేశ్ స్పష్టీకరణ
- కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చిన మాజీ మంత్రి
- లైడిటెక్టర్, నార్కో అనాలసిస్ టెస్టులకు తాను సిద్ధమని ప్రకటన
- తన వ్యక్తిత్వాన్ని హననం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తనపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? అని సవాల్

వివరాలు 2లో..

'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

## అన్ని రాష్ట్రాలకు నోటీసులు



- 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ
- మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం
- ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు
- ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసా లపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది.

వివరాలు 2లో..

ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

## వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- వీధి కుక్కల నియంత్రణపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఆదేశాలు పాటించని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు సమన్లు
- పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలకు మినహాయింపు
- నవంబర్ 3న కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- దేశ ప్రతిష్ట దెబ్బతింటోందని ధర్మాసనం కీలక వ్యాఖ్య
- హాజరు కాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వీధి కుక్కల నియంత్రణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము జారీ చేసిన ఆదేశాలను పాటిం చడంలో విఫలమైనందుకు పశ్చిమ బెంగాల్, తెలంగా ణ మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు (ప్రధాన కార్యదర్శులు) సమన్లు జారీ చేసింది. వారంతా నవంబర్ 3న తమ ఎదుట వ్యక్తిగతంగా

వివరాలు 2లో..



## ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- ఏపీ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా రూ.33,630 కోట్ల విలువైన పనులు
- నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ పనుల పురోగతిపై చర్చ
- అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, కొత్త లైన్ల ప్రతిపాదనల ప్రస్తావన
- సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబా బు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.33,630 కోట్ల విలువైన రైల్వే పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు

వివరాలు 2లో..

## గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు



- బీజేపీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీని గెలిపిస్తుందన్న పాల్
- ఈవీఎం ఉన్నంత వరకు బీజేపీయే అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- బ్యాలెట్ వధానం కోసం తాము పోరాడుతున్నామన్న కేఏ పాల్

వివరాలు 2లో..




# దటీజ్ చంద్రబాబు 70ఏళ్ల వయస్సులో చాలెంజ్

10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

## ఏం.. మీరు న్యూస్ పేపర్లు చదవడంలేదా?...

# వీధి కుక్కల అంశంపై సుప్రీంకోర్టు ఫైర్

- మొదటి పేజి తరువాయి

హాజరు కావాలని సోమవారం ఆదేశం చింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) రూల్స్, 2023 అమలుపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఈ ఏడాది ఆగస్టులోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, చాలా రాష్ట్రాలు పట్టించుకోకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. "అధికారులు వార్తాపత్రికలు చదవడం లేదా? సోషల్ మీడియా చూడటం లేదా? ఆదేశాలు అందకపోయినా, అఫిడవిట్లు ఇక్కడ ఉండాల్సింది. నవంబర్ 3న చీఫ్ సెక్రటరీలందరూ తప్పనిసరిగా కోర్టులో హాజరు కావాలి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. పశ్చిమ బెంగాల్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మాత్రమే అఫిడవిట్లు దాఖలు చేశాయని కోర్టు గుర్తించింది. "దేశంలో వీధి కుక్కలకు సంబంధించిన ఘటనలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. దీనివల్ల విదేశాల దృష్టిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. మేం కూడా వార్తా కథనాలను చదువుతున్నాం" అని ధర్మాసనం ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సమయంలో, ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ వివిధ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు (%=ఔూ%), వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. "దేశంలోని %=ఔూ%లన్నీ ఈ కేసులో పార్టీలుగా చేరతామంటే, మన ముందు కోట్లాది మంది ఉంటారు కదా? సహేతుకమైన సూచనలు చేయండి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణ తేదీన చీఫ్ సెక్రటరీలు హాజరు కాకపోతే, కఠిన చర్యలతో పాటు జరిమానాలు కూడా విధిస్తామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఢిల్లీ విషయంలో ఎంసీడీ ఇచ్చిన నివేదిక సరిపోదని, అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కాగా, ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల ప్రకారం, కుక్కల స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలతో పాటు, వాటి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ల వివరాలతో అన్ని రాష్ట్రాలు నివేదికలు సమర్పించాల్సి ఉంది. ఈ కేసు తదుపరి విచారణ నవంబర్ 3న జరగనుంది.

# తుపానుపై సంచలన థంబ్ నెయిల్స్, హెడ్డింగ్‌లతో భయభ్రాంతులకు గురిచేయొద్దు

ఏపీకి మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, సహాయక చర్యలకు సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని, ముఖ్యంగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు సంయమనం పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సంచలనాల కోసం తప్పుడు థంబ్‌నెయిల్స్, హెడ్డింగులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె హితవు పలికారు.

**ప్రభుత్వం పూర్తి సన్నద్ధం**

తుపాను హెచ్చరికలు వెలువడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని మంత్రి అనిత తెలిపారు. గత మూడు రోజులుగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ తో కలిసి తాను కూడా ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అన్ని విభాగాలను అప్రమత్తం చేశామని వివరించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో పాటు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, సహాయక చర్యలకు అవసరమైన నిధులను కూడా విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మీడియా ద్వారా వాస్తవ పరిస్థితులను వివరిస్తున్నామని తెలిపారు.

**సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలి**

విపత్కర సమయాల్లో సమాచారాన్ని వేగంగా చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వేదికలు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి అనిత నొక్కిచెప్పారు. అయితే, కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు కేవలం వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా థంబ్‌నెయిల్స్, సంచలన హెడ్డింగులు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఆర్టీజీఎస్ సెంటర్ ద్వారా ఈ విషయం తమ పరిశీలనలోకి వచ్చిందని, ఇలాంటి తప్పుడు ప్రచారాల వల్ల ప్రజల్లో తీవ్ర గందరగోళం, అలజడి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్టవిరుద్ధం. అభూత కల్పనలు, అవాస్తవాలతో కూడిన సమాచారం తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలను, వారి కుటుంబ సభ్యులను మానసికంగా కుంగదీస్తుంది. దీన్ని నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని అనిత స్పష్టం చేశారు. వార్తల కవరేజీలో వాస్తవాలకు అద్దం పట్టేలా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకోవాలని ఆమె సూచించారు. సమాచార వ్యాప్తిలో కీలకపాత్ర పోషించే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా కూడా ఈ విపత్కర సమయంలో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవాలని హోం మంత్రి కోరారు.

# రష్యా నుంచి చమురు కొనుగోలు.. ట్రంప్ ప్రభుత్వంపై జైశంకర్ ఆగ్రహం

రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో అమెరికా ఒక్కో దేశంతో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. నీతులు బోధించేవారే వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కౌలాలంపూర్‌లో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకం విధిస్తున్న విషయం విదితమే. చమురు కొనుగోళ్లను నిలిపివేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో జైశంకర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# విజయవాడ కనకదుర్గమ్మ సాక్షిగా సత్యప్రమాణం చేసిన జోగి రమేశ్.. చంద్రబాబు, లోకేశ్‌కు సవాల్

నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంలో సత్యప్రమాణం చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి చేరుకున్న ఆయన, ఘాట్ రోడ్డు ప్రవేశద్వారం వద్ద చేతిలో దీపం వెలిగించి, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జోగి రమేశ్ మాట్లాడుతూ.. "నా వ్యక్తిత్వంపై నింద వేశారు. నా మనసును గాయపరిచారు. అందుకే కుటుంబంతో సహా వచ్చి, ఏ తప్పు చేయలేదని అమ్మవారి ఎదుట నిండు మనసుతో ప్రమాణం చేశాను. నా కుటుంబాన్ని అవమానించిన వారికి అమ్మవారు మంచి బుద్ధి ప్రసాదించాలి" అని అన్నారు. గతంలో తాను చెప్పినట్లే తిరుపతి వెంకన్న, బెజవాడ దుర్గమ్మపై ప్రమాణానికి కట్టుబడి ఉన్నానని, అందులో భాగంగానే ఇప్పుడు ప్రమాణం చేశానని తెలిపారు. నకిలీ మద్యం కేసులో నార్కో అనాలసిస్, లైడిటెక్టర్ టెస్టులకు కూడా తాను సిద్ధంగా ఉన్నానని పునరుద్ఘాటించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. "నాపై తప్పుడు ఆరోపణలు చేసిన వారు సత్యప్రమాణానికి సిద్ధమా? కనీసం లైడిటెక్టర్ టెస్టుకైనా వచ్చే దమ్ముందా? కనకదుర్గమ్మ సాక్షిగా నేను తప్పు చేసినట్లు నిరూపించాలి" అని సవాల్ విసిరారు.

# తుపాను సందట్లో దొంగల బెడద లేకుండా చూడాలి

మొంథా తుపాను కాకినాడ సమీపంలో తీరం దాటనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ కర్తవ్యంగా భావించి, ముందస్తు రక్షణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం, సహాయక చర్యలపై కాకినాడ జిల్లా ఇంఛార్జి మంత్రి నారాయణ, స్పెషల్ ఆఫీసర్ కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, ఎస్పీ బిందు మాధవ్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాలోని 12 మండలాలపై అధికంగా ఉంటుందని సమాచారం. రేపు కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. యంత్రాంగం 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. తీర ప్రాంత ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే జిల్లాలో 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలు సిద్ధంగా ఉంచాలి" అని దిశానిర్దేశం చేశారు.

ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ సూచించారు. "పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న గర్భిణులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను పునరావాస కేంద్రాలకు చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. వారికి అవసరమైన పౌష్టికాహారం, వైద్య సేవలు నిరంతరం అందేలా చూడాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలి. తుపానుపై భయాందోళనలు సృష్టించకుండా, గ్రామాల్లో మైకుల ద్వారా సహాయక చర్యలను వివరిస్తూ ప్రజలకు ధైర్యం చెప్పాలి" అని ఆయన అన్నారు.

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

తుపాను సహాయక చర్యల్లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లిన ప్రజల ఇళ్లకు దొంగల బెడద లేకుండా పోలీసులు ప్రత్యేక భద్రత కల్పించాలని, అవసరమైతే సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున, ఆయకట్టు ప్రజలను జలవనరుల శాఖ అధికారులు ముందుగానే అప్రమత్తం చేయాలన్నారు. బలహీనంగా ఉన్న చెరువు కట్టలు, కాలువ గట్లను గుర్తించి ఇసుక బస్తాలతో పటిష్ఠం చేయాలని సూచించారు.

మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలని, వారి బోట్లకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు తెలిపారు. తుపాను కారణంగా నిత్యావసర వస్తువుల సరఫరాకు ఆటంకం కలగకుండా మార్కెటింగ్ శాఖ చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్నందున, మరమ్మతుల కోసం సిబ్బందిని సిద్ధం చేయాలని, అత్యవసర సమాచారం కోసం శాటిలైట్ ఫోన్లను వినియోగించాలని సూచించారు.

**కాకినాడకు కోటి రూపాయల అత్యవసర నిధి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్లు విడుదల చేయగా, అందులో కాకినాడ జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ నిధులను పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, బాధితులకు నిత్యావసరాల పంపిణీ, దెబ్బతిన్న ఇళ్లకు తక్షణ సాయం అందించడం వంటి కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఏపీలో ఇప్పుడు హై అలర్ట్... కలసికట్టుగా ఎదుర్కొందాం

- మొదటి పేజి తరువాయి

ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు తుపాను సన్నద్ధతపై ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో దాదాపు 40 లక్షల మంది ప్రజలు తుపాను ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లోని 1,238 గ్రామాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,906 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు వివరించారు. ముఖ్యంగా 3,465 మంది గర్భిణులు, బాలింతలను గుర్తించి, వారిని సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

ముందస్తు చర్యల్లో భాగంగా 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, వాటిలో 364 పాఠశాలలను తుపాను షెల్టర్లుగా మార్చారు. అక్టోబర్ 29 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, బోటింగ్, బీచ్‌లలో పర్యాటకంపై పూర్తి నిషేధం విధించినట్లు లోకేశ్ వెల్లడించారు. సహాయక చర్యల కోసం 11 ఎన్డీఆర్ఎఫ్, 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. అగ్నిమాపక సిబ్బంది, బోట్ బృందాలు, చెట్లను తొలగించే బృందాలను లైఫ్ జాకెట్లు, ఇతర రక్షణ పరికరాలతో సిద్ధం చేశారు. అత్యవసర వైద్య సేవలకు 325 మెడికల్ క్యాంపులు, 876 ఆరోగ్య తక్షణ స్పందన బృందాలు, 108, 104 అంబులెన్సులను అందుబాటులో ఉంచారు. మూడు బోట్ క్లినిక్‌లను కూడా క్రియాశీలకం చేశారు.

తుపాను అనంతరం విద్యుత్ పునరుద్ధరణ కోసం 772 బృందాలను 11,347 స్తంభాలు, 1,210 ట్రాన్స్‌ఫార్మర్లతో సిద్ధంగా ఉంచారు. రహదారులపై అడ్డంకులను తొలగించడానికి 7,289 యంత్రాలు, తాగునీటి సరఫరాకు 1,521 ట్యాంకర్లు, 1,037 జనరేటర్లు ఏర్పాటు చేశారు. కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం కలగకుండా 16 శాటిలైట్ ఫోన్లు, 35 డీఎంఆర్ సెట్లు, 10 మొబైల్ నెట్‌వర్క్ టవర్లను (%జూ౦౦%) కీలక ప్రాంతాల్లో మోహరించారు. ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్మీ, ఎన్డీఎంఏ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దని మంత్రి లోకేశ్ సూచించారు. ప్రభుత్వం జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ఈ విపత్తును అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఆయన పిలుపునిచ్చారు.

# గెలిస్తే అనుమానం వస్తుందని బీహార్‌లో బీజేపీ గెలవదు

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవదని, ఆ పార్టీయే ఆర్జేడీని గెలిపిస్తుం దని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అసలైన ఓట్లను తొలగించి, లేని ఓట్లను చేర్చారని ఆరోపించారు. దేశంలో ఈవీఎం ద్వారా ఓటింగ్ ఉన్నంత వరకు బీజేపీ అధికారంలో ఉంటుందని ఆయన వ్యాఖ్యా నించారు. బీహార్‌లో బీజేపీ గెలిస్తే దేశ ప్రజలకు అనుమానం వస్తుందనే ఆలోచనతో అక్కడ ఆర్జేడీని గెలిపిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికలు బ్యాలెట్ విధానంలోనే జరగాలని ఆయన డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానం కోసం తన పార్టీ పోరాడుతోందని కేఏ పాల్ పేర్కొన్నారు.

## 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్...

# అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించా లని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది.

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భం గా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడా నికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# మొంథా తుపానుపై సీఎం చంద్రబాబు సమీక్ష..

- మొదటి పేజి తరువాయి

కాలువ గట్లను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌కు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్..

- మొదటి పేజి తరువాయి

ఎస్ఐఆర్ విజయవంతమైందని, మరో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో దీనిని నిర్వహించబోతున్నామని తెలిపింది. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, రెండో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను త్వరలో చేపట్టనున్నామని వెల్లడించారు.

1951 నుంచి 2004 వరకు ఎనిమిదిసార్లు ఎస్ఐఆర్ నిర్వహించారని అన్నారు. 21 ఏళ్ల కిందట ఓటర్ల జాబితా సవరణ జరిగిందని గుర్తు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, అక్రమ వలసదారులు, చనిపోయిన, బదిలీ చేయబడిన ఓటర్లను తొలగించినట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. బీహార్‌లో 7.5 కోట్ల మందితో ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయిందని అన్నారు. బీహార్‌లో ఈ ప్రక్రియపై ఎవరూ అభ్యంతరాలు చెప్పలేదని తెలియజేశారు. రెండో దశలోనూ ప్రతి ఇంటికి మూడుసార్లు వెళ్లి ఓటరుపై నిర్ధారణ చేసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ అవగాహన కల్పిస్తామని ఆయన అన్నారు. రెండో దశలో ప్రత్యేక సమగ్ర సవరణ జరగనున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు: అండమాన్ నికోబర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్. రెండో దశ ఎస్ఐఆర్ జరగనున్న రాష్ట్రాల్లో 51 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని, నవంబర్ 4వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. అసోంలో ఎన్ఆర్సీ ఉన్నందున ఎస్ఐఆర్ లేదని స్పష్టం చేశారు.

# ఏపీలో రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ కీలక ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన రైల్వే లైన్ల పనుల పురోగతిపై అధికారులు నివేదిక సమర్పించారు. ముఖ్యంగా నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు-గుంతకల్ డబ్లింగ్, గుణదల-ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్-తుముకూరు మధ్య కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు ఎంతవరకు వచ్చాయో చర్చకు వచ్చింది. వీటితో పాటు, రాష్ట్రంలో కొత్తగా చేపట్టాల్సిన రైల్వే లైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ), అండర్ బ్రిడ్జి (ఆర్ యూబీ)ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలపైనా సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వేలకు చెందిన పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సమన్వయంతో పనిచేయాలని ఈ సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# తుఫాన్ పరిస్థితులలో గూడెం కొత్త వీధి మండలంలో ప్రజల భద్రతకు ప్రత్యేక చర్యలు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో గూడెం కొత్త వీధి మండలంలో సంబంధిత రోడ్డు మార్గాలు, కాలువలు మరియు చెరువుల వద్ద అత్యంత అప్రమత్తత తీసుకోవాలని తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు సూచించారు. ముఖ్యంగా సంపంగిగొంది, ధారకొండ అగ్రహారం, ధారకొండ%–%మాదిగమల్లు, గొల్లపల్లి కాలువ, నీలవరం చెరువు వంటి ప్రాంతాల్లో అధికంగా నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రమాదకర పరిస్థితుల్లో దాటకుండా చూడటానికి సంబంధిత వీఆర్వో, వీఆర్ఏలకి ఆదేశాలు ఇచ్చారు.గతంలో కొండచరియలు కారణంగా ప్రమాదాలను ఎదుర్కొన్న చట్రపల్లి గ్రామ ప్రజలకు సప్పర్ల గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను పునరావాస కేంద్రంగా ఎంచి, పునరావాసానికి అవసరమైన ఏర్పాట్లు ఆహారం, త్రాగునీరు, తాత్కాలిక సౌకర్యాలు మొదలైనవి ఏర్పాటు చేయటానికి డిప్యూటీ తహసీల్దార్ బాధ్యత వహించగా, ప్రతి వీఆర్వో తన హెడ్క్వార్టర్స్ వద్ద లభ్యమయ్యేలా నిర్వహణ చేయమని సూచించారు.అత్యవసర




పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో లేని అధికారులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరిస్తూ, స్థానికులను అప్రమత్తంగా ఉండమని పిలుపునిచ్చారు.

# మెడికల్ కాలేజ్ లను ప్రైవేటీకరణ చేయడం సరికాదు ఇది ప్రజల అభిప్రాయం.

**కోటి సంతకాల సేకరణ మరియు, రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ హుకుంపేట మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్**



**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 27. అరకు**

నియోజకవర్గం,హుకుంపేట మండలం శోభకోట గ్రామ పంచాయతీఅర్లడా గ్రామం లో,అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాలు మేరకు వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా సేకరణ మరియు రచ్చబండ కార్యక్రమంలో అర్లడా గ్రామస్తులతో కలిసి నిర్వహించడం జరిగింది.

అనంతరం పలువురు గ్రామస్తుల చేత సంతకాలు చేయించడం జరిగింది.

ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ మాట్లాడుతూ.పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైద్య సేవలను అందించేందుకు రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 17 నూతన మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు.కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు. రాష్ట్రంలో కోటి సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్ర గవర్నర్ ను కలిసి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని తెలియజేస్తూ వైద్య విద్యార్థులకు న్యాయం చేయాలని కోరడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొంతిలి గ్రామపంచాయతీ సర్పంచ్ రేగం రమేష్ వైసీపీ మండల ఉపాధ్యక్షులు కాకరి వెంకటరావు హుకుంపేట మండలజనరల్ సెక్రటరీ గడ్డంగి సూరిబాబు

శోభకోట గ్రామపంచాయతీ సూపర్ సర్పంచ్ మర్రి చిన్నారావు హుకుంపేట గ్రామపంచాయతీ కమిటీ అధ్యక్షులు వండలి నాగేష్ శోభకోట గ్రామపంచాయతీ కమిటీ అధ్యక్షులు నందక దొర వెంకట్ ,నాయకులు, గండేరు శ్రీను ,కొర్ర రామారావు బద్నాయిని నాగరాజు, సూరిబాబు వైసీపీనేతలు నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# మొంథా తుఫాన్‌పై అధికారులు అప్రమత్తం
# ప్రజలు ఇళ్లలోనే ఉండాలని విజ్ఞప్తి



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 27 :**మొంథా తుఫాను తీవ్రత పెరుగుతున్న నేపథ్యం లో ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా వ్యవహరి స్తోంది. ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి, అత్య వసరమైతే తప్ప బయటకు రావొద్దు, అని రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డిజాస్టర్ మేనేజ్‌మెం ట్ అజయ్ జైన్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్తో కలిసి ఆయన సోమవారం సాయంత్రం మీడి యా సమావేశంలో మాట్లాడారు.అజయ్ జైన్ వివరించిన ప్రకారం, మొంథా తుఫాను సోమ వారం సాయంత్రానికి విశాఖకు 560 కి.మీ. ఆగ్నేయ దిశలో ఉంది. ఇది గంటకు 19 కి.మీ. వేగంతో కదులుతూ, అక్టోబర్ 28 అర్ధరాత్రి నుంచి 29 తెల్లవారుఝామున మధ్యలో తీరం దాటే అవకాశం ఉంది. ప్రస్తుత అంచనాల ప్రకారం కాకినాడ పశ్చిమ దిశలో తీరం తాకే అవకాశం ఉన్నప్పటికీ, దిశ మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.తుఫాను ప్రభావం 17 జిల్లాల వరకు ఉండొచ్చని, అందులో 9 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యే అవకా శం ఉందని తెలిపారు. ఆ పరిధిలో 87 మండ లాలు, 705 గ్రామాలు, 16 అర్బన్ ప్రాంతాలు ఉన్నాయి. ఇప్పటివరకు 1,058 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసామని, వాటిలో 32,467 మందికి సురక్షిత వసతి కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను 11గా రంగంలోకి దింపినట్లు వెల్లడించారు. విద్యుత్ శాఖ ఆధ్వ ర్యంలో 13 వేల స్తంభాలు, 6 వేల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తీరప్రాంత జిల్లాల్లో హోర్డింగులు తొలగించమని, మ్యాన్‌హోల్స్ సరిచేయాలని సూచించారు. జలాశయాల వద్ద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా సూచనలు జారీ చేశామన్నారు.

కొండవాలు ప్రాంతాల ప్రజలు వెం టనే పునరావాస కేంద్రాలకు వెళ్లా లి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించా రు.“ఈ రెండు రోజులు అవసరం లేకుండా బయటకు వెళ్లొద్దు. సముద్ర తీర ప్రాంతాలకు చేరవద్దు,” అని ఆయన విజ్ఞప్తి చేశారు. కొండవాలు ప్రాంతాల ప్రజలు ముందు గానే పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు.

అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నంబర్లు 0891%–2590100, 0891–% 2590102ను సంప్రదించవచ్చని తెలిపారు. అదనంగా జీవీఎంసీ వాట్సాప్ నంబర్ 96669 09192 ద్వారా కూడా సహాయం పొందవచ్చని చెప్పారు.జిల్లాలోని 11 మండలాల్లో 15 తీర గ్రామాలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయని, వాటి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సదుపాయాలు నిరంతరాయం గా కొనసాగేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

ఇండియన్ నేవీ సహకారంతో హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచామని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ ఎఫ్ బృందాల సిబ్బంది మొత్తం 90 మంది ప్రస్తుతం సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని చెప్పారు.

రాబోయే 48 గంటలు కీలకం ప్రజల సహ కారమే ప్రధాన రక్షణ అని కలెక్టర్ పేర్కొన్నారు.

# వర్షపు బీభత్సం సిండియా గాజువాక



**రహదారి మోకాలు లోతు నీటిలో మునిగిపోయింది**

**ములగాడ,పెన్ పవర్,అక్టోబర్ 27 :**మొంథా తుఫాన్ ప్రభావంతో నగరంలోని అనేక ప్రాంతాలు వర్షపు బీభత్సాన్ని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా సిండియా నుంచి గాజువాక కు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోయింది. నోసనబాగ్ జంక్షన్ వద్ద నీటి ప్రవాహం లేకపోవడంతో మోకాలు లోతు నీరు నిలిచిపోయి, రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.తీవ్ర వర్షంతో ఆ ప్రాంతం మొత్తమూ చిన్న చెరువుగా మారిపోయింది. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు నీటి లో చిక్కుకోవడంతో కొంతమంది ప్రయాణికులు మధ్య రోడ్డులోనే ఇరుక్కుపోయారు. సమాచా రం అందుకున్న మల్కాపురం లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బంది తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని, రహదారిపై వాహన రాకపోకలను నియంత్రించారు. నీటిలో చిక్కుకున్న వాహన దారులకు సహాయ సహకారాలు అందిస్తూ, ట్రాఫిక్‌ను మరల్చే చర్యలు చేపట్టారు.

పౌరులు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఆ మార్గంలో ప్రయాణం చేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు.నగరంలో ఇంకా పలుచోట్ల నీరు నిలిచిపోయినందున, మునిసిపల్ సిబ్బంది డ్రైనేజ్ వ్యవస్థను శుభ్రం చేయడంపై దృష్టి పెట్టారు.



# హర,,హర,, మహాదేవ శంభో శంకర




**శివనామస్మరణతో మారుమ్రోగిన శివాలయాలు భక్తిశ్రద్ధలతో కార్తీక మొదటి సోమవార పూజలు**





**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 27:** పరమేశ్వరుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే మాసం కార్తీకం మాసం. శివాయ విష్ణురూపాయ అంటారు కార్తీకానికి హరిహరుల మాసమని పేరు ఈ నెలలో వచ్చే చతుర్దశి స్థితిని వైకుంఠ చతుర్దశిగా పిలుస్తారు. శివుని పూజించే ఈ మాసంలో విష్ణుమూర్తికి ప్రాధాన్యతని ఇస్తారు. అక్టోబర్ మాసం 22న కార్తీక్ మాస్ ఆరంభంతో మొదలై అక్టోబర్ 27న మొదటి కార్తిక సోమవారం నవంబర్ 17న నాల్గవ కార్తిక సోమవారం 21న పోలి పాడ్యముతో కార్తీక్ మాసం ముగిసి మార్గశిర మాస ప్రారంభమవుతుంది. కార్తీక మాసం మార్గశిర మాసాలకు మహిళలలు అత్యంత ప్రాముఖ్యత నుంచి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులను తీర్చుకుంటూ అత్యంత నియమ నిష్టలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ఆరిలోవ 13 వ వార్డు శివాజీ నగర్ 2 లో గల శ్రీశ్రీశ్రీ ముత్యమాంబ ఆలయంలో వెలిసియున్న శ్రీ శ్రీ శ్రీ అన్నపూర్ణ శివపంచాయతన సహిత ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం లో ఈనెల 22 న మొదలైన కార్తీక మాసం నవంబర్ నెల 20 పోలి పాడ్యమితో ముగుస్తుందని నవంబర్ 17న మహా అన్నదాన సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ గౌరవ అధ్యక్షులు పిల్లి వీర్రాజు.తెలిపారు.

ఆరిలోవ సెక్టార్ 2లో గల శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి సహిత మమ మల్లేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం నెలరోజుల అభిషేకముల కార్యక్రమాలు మరియు ఈనెల 22 నుండి నవంబర్ నెల 20 వరకు కార్తీకమాసంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన ధర్మకర్త ఎం కృష్ణంరాజు తెలియజేశారు. మొదటి కార్తీక సోమవారం కావడంతో విద్యుత్ దీపాలు వివిధ రకాల పూలతో శివాలయాలు కలరింగ్ అలంకరించారు. తెల్లవారుజాము నుండి శివనామస్మరణలతో భక్తులు దేవాలయాలలో పూజలు నిర్వహించారు.స్వచ్ఛందంగా భక్తులు కార్యక్రమాలలో పాల్గొన్నారు.ధర్మకర్త మూది అప్పారావు.కె.వివెంకటరమణ.బి శంకర్రావు.రామచంద్రరావు. సత్యనారాయణ.రమణ. కమిటీ సభ్యులు మరియు శ్రీశ్రీశ్రీ ముత్యమాంబ ఆలయ కమిటీ అధ్యక్షులు నారాయణ. ఉపాధ్యక్షులు ఆర్ అప్పారావు కార్యదర్శి మధు. కోశాధికారి రమణ.అశోక్. శివాజీ.తదితరులు పాల్గొన్నారు.



## తుఫానుకు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ సుభద్ర



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**తుఫాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గూడెం కొత్త వీధి సర్పంచ్ సుభద్ర విజ్ఞప్తి చేశారు. జి.కె. వీధి మండల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను సమయానికి చేరవేయాలని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు. పాత, బలహీన ఇళ్లలో నివసించే వారు, నదీ తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, వృద్ధులు, చిన్న పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సుభద్ర సూచించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తుఫాను సమయంలో అనవసర ప్రయాణాలు మానుకోవాలని, అధికారుల సూచనలను తప్పక పాటించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు మండల యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని సర్పంచ్ తెలిపారు. ప్రజలు భయాందోళన చెందకుండా ధైర్యంగా వ్యవహరించి అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

## తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :జీకే వీధి ఎస్సై సురేష్ హెచ్చరిక



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**రాబోయే మూడు రోజులపాటు తుఫాన్ ప్రభావం కారణంగా ప్రజలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ పిలుపునిచ్చారు.మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, తుఫాన్ దృష్ట్యా రెవెన్యూ, ఆరోగ్య మరియు పోలీస్ శాఖలు మండలంలో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు విరగడం, కొండచరియలు జారిపడడం వంటి ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.ప్రజలు సురక్షిత గృహాలలోనే ఉండాలి, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని సూచించారు. తుఫాన్ సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, బలహీనమైన గోడల వద్దకు వెళ్లరాదని హెచ్చరించారు. మండలంలో అంబులెన్స్, చెట్లను తొలగించేందుకు అవసరమైన కట్టర్లు మరియు అత్యవసర సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. "ఈ తుఫాన్‌ను ప్రజలు తేలికగా తీసుకోవద్దు, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఉండాలి" అని ఎస్సై సురేష్ విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు, కల్వర్టు పనులు ప్రారంభం

జర్రెల పంచాయతీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయతీలో సోమవారం పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు మరియు కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమం సర్పంచ్ వార్డు సభ్యులు కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించడం శుభపరిణామమని అన్నారు. ఎన్నడూ లేని విధంగా పలు గ్రామాలకు ఒకేసారి అభివృద్ధి పనులు ప్రారంభించడం కూటమి ప్రభుత్వానికి పెద్ద విజయమని పేర్కొన్నారు.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వమే మార్గదర్శకమని, ప్రజల మద్దతుతో పంచాయతీ స్థాయిలోనూ అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. జర్రెల రామాలయం వీధిలో సీసీ రోడ్డు పనులు, నిట్టిమామిడి పాలెం గ్రామంలో కల్వర్టు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.గత ప్రభుత్వ పాలనలో జర్రెల పంచాయతీలో అభివృద్ధి పనులు గణనీయంగా జరగలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొదటిసారిగా ఎక్కువ వర్కులు ప్రారంభించబడటం సంతోషకరమని విష్ణుమూర్తి అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రజల సమస్యలను నిజాయితీగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధి దిశగా నడిపించే నాయకుడిని ప్రజలు ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లోవకుమారి, జనసేన పార్టీ పంచాయతీ అధ్యక్షులు చిక్కుడు అశోక్, కూటమి నాయకులు అనిల్, బాబురావు, రాజుబాబు, మత్యరాజు, సంతోష్, బుజ్జిబాబు, వార్డు సభ్యులు భగవాన్, నూకలమ్మ, వైసీపీ పార్టీ నాయకులు చిన్నబ్బాయి, స్వామినాథం, సింహచలం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ పట్ల గూడెం కొత్తవీధి అధికారుల అప్రమత్తత - ప్రజల భద్రతే లక్ష్యం

## ప్రాణ-ఆస్తి నష్టం లేకుండా చర్యలు చేపట్టండి: ఎంపీడీవో రమణబాబు సూచన





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**"మొంథా తుఫాన్" నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులను ఎంపీడీవో బీహెచ్వి రమణబాబు సూచించారు.జీకే వీధి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఎంపీడీవో బీహెచ్వి రమణబాబు మాట్లాడుతూ, వరదలు సంభవించే ప్రాంతాలు, కొండచరియలు విరిగే ప్రమాదం ఉన్న గ్రామాలను గుర్తించి ప్రాణనష్టం,ఆస్తి నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ముందు, తర్వాత చేపట్టాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. ప్రమాదకర వాగులు, కాలువలు పొంగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రైనేజ్ క్లియరెన్స్, పడిపోయిన చెట్లు తొలగించడం, ఓహెచ్ఎస్ఆర్‌ల క్లోరినేషన్ చేయించడం, విద్యుత్ అంతరాయాలను పరిష్కరించడం వంటి అంశాలపై ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. తోకరాయి, చట్రపల్లి, అగ్రహారం వంటి గ్రామాల్లో గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా ముందస్తు చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు.గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులను ముందుగానే గుర్తించి, సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆరోగ్య శాఖ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డిప్యూటీ ఎంపీడీవో బాలకృష్ణ మాట్లాడుతూ శానిటేషన్ కార్యక్రమాల్లో భాగంగా బ్లీచింగ్, సోడియం హైపోక్లోరైట్, ఫినాయిల్ వేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఎమ్మార్వో అన్నాజీ రావు మాట్లాడుతూ గాలికొండ పంచాయతీ పరిధిలోని చట్రపల్లి గ్రామంలో గతంలో జరిగిన కొండచరియల ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని, సప్పర్ల జిటీడబ్ల్యూ. బాయ్స్ స్కూల్‌ను రిహాబిలిటేషన్ కేంద్రంగా గుర్తించామని తెలిపారు.స్థానిక ఎస్సై సురేష్ మాట్లాడుతూ, తుఫాన్ సమయంలో ఏ విధమైన ప్రమాదం జరగకుండా ముందస్తు అవగాహన కల్పిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, పిఆర్ఏఈ జ్యోతిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్‌రామ్, ఎలక్ట్రికల్ ఏఈ ప్రభాకర్, ఇరిగేషన్ ఏఈ, విద్య, వైద్య, ఆర్అండ్‌బి, ఫారెస్ట్ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## తుఫాన్ ప్రభావం: భద్రాచలం-సీలేరు బస్సులు రద్దు




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**'మొంథా' తుఫాన్ ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మీదుగా భద్రాచలం మరియు సీలేరు వెళ్లే బస్సులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు గూడెం కొత్త వీధి ఎస్ఐ సురేష్ తెలిపారు.తుఫాన్ కారణంగా కొండచరియలు జారిపడే అవకాశం ఉన్నందున, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఈ మార్గంలో ప్రయాణాలు చేయవద్దని, రోడ్డు పరిస్థితులు సురక్షితంగా మారిన తరువాతే బస్సు సర్వీసులు పునరుద్ధరించబడతాయని ఎస్ఐ సురేష్ తెలిపారు.

## వర్షం కారణంగా బోసిపోయిన ఆర్వి నగర్ సంత



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ అక్టోబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే విధి పంచాయతీ పరిధిలోని ఆర్వి నగర్ లో సోమవారం నిర్వహించే వారపు సంత ముంథా తుఫాన్ కారణంగా బోసిపోయింది. వర్తకులు దుకాణాలు పెట్టినప్పటికీ మధ్యాహ్నం నుండి వర్షం పెరగటంతో వినియోగదారులు సంతకు రాకపోవటంతో సంత బోసిపోయింది. వ్యాపారాలు జరగక వ్యాపారులు తుఫాన్ కారణంగా వినియోగదారులు రాక వ్యాపారం ఏమీ జరగక ఇబ్బంది పడాల్సి వచ్చిందని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

## మొంథా తుఫాన్: ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు.ప్రజలు తమ ప్రాణాలు,ఆస్తి నష్టాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ శాఖ సూచనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో తప్పనిసరిగా మాత్రమే ప్రయాణం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున అక్టోబర్ 28, 29 తేదీల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కుందేరి రామకృష్ణ సూచించారు. అలాగే వరి పొలాలలో నీరు అధికంగా నిలబడి ఉండకుండా రైతులు చర్యలు చేపట్టాలని సూచించారు. చెట్ల క్రింద విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదని తెలిపారు.

## ఏజెన్సీలో మొక్కజొన్న రైతుల అవస్థలు.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 27.పెన్ పవర్.**గుమ్మలక్ష్మీపురం మండలం లోవముఠా ప్రాంతం దుడ్డుఖల్లు.కొత్తవలస.లోవ లక్ష్మీపురం గ్రామాలలో.మొక్కజొన్న రైతులు అవస్థలు. సోమవారం నాడు కురిసిన అకాల వర్షానికి కళ్ళం లో ఉన్న మొక్కజొన్న పూర్తిగా తడిచిపోయాయని రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చేతి కందిన పంట నేలపాలయిపోవడం చాలా బాధాకరంగా ఉందని ఈ ప్రాంతమంతా వర్షాధారిత గా పండించే పంటలేనని సంవత్సరంలో ఒక్కసారి మాత్రమే పంట వస్తుంది అలాంటి పంట నేల పాలైపోయింది పంటకు అప్పులు చేసి పెట్టామని.మమ్మల్ని ప్రభుత్వామే ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## గుమ్మిరేవుల పంచాయతీలో నూతన వైఎస్సార్‌సీపీ కమిటీలు ఎన్నిక

జీకే వీధి మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పిలుపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**అల్లూరి సీతారామ రాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని అన్నవరం గ్రామంలో సోమవారం "నూతన పంచాయతీ కమిటీలు ఎన్నిక" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా పార్టీ అధ్యక్షులు పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనలతో, జీకే వీధి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి ఆధ్వర్యంలో, గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా గుమ్మిరేవుల పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా వంతల రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా కొర్ర అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ప్రభుత్వం ప్రతిపాదించిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా "కోటి సంతకాల సేకరణ" కార్యక్రమం కూడా చేపట్టారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసి 2029 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు ఏవైనా ఉన్నా వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లోత దేముడు, లకవరపుపేట ఎంపీటీసీ మొట్టడం సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటి బాబు, నాయకులు కంకిపాటి నారాయణరావు, గొల్లోరి మహదేవ్, ఉప సర్పంచ్ జోరంగి వెంకటరమణ, కోడా బొంజిబాబు, చంద్రబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. కాకనూరు, కనుసుమెట్ట, చింతగుప్ప, మాదిమల్లు, నేలజర్త వంటి గ్రామాల నుండి పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరయ్యారు.

# ముంచుకొస్తున్న తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండండి

* బిజెపి పాడేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మంగతల్లి



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 27** :బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో ముంచుకొస్తున్న తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పాడేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, మచ్చల మంగతల్లి, బిజెపి కొయ్యూరు మండల అధ్యక్షుడు సంపరి శివకుమార్ ప్రజలకు సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం తెలుగు రాష్ట్రాలతో పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో తీవ్రతరంగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ప్రస్తుతం సమీప కాకినాడ జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అల్లూరి జిల్లా వ్యాప్తంగా కూడా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. అత్యవసర సమయాల్లో తప్పితే ఇళ్ళను వీడి బయటకు రావద్దని తెలియపరిచారు. మన్యంలో వర్షంతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్లు స్తంభాలు టవర్స్ వంటి వాటి కింద ఉండరాదని తెలిపారు. తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా కోస్తాంధ్ర పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్త వహించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కొండ వాగులు ఉదృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున వాగుల్లోకి ఎవరూ దిగరాదని తెలిపారు. రెవెన్యూ పోలీస్ అధికారుల సూచనలను పాటిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

# కార్తీక మాసం తొలి సోమవారానికి ఆర్వీ నగర్ శివాలయంలో భక్తుల రద్దీ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 27:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలోని ఆర్వీ నగర్ శివాలయంలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి, దీపదూప నైవేద్యాలతో పరమశివుని ఆరాధించారు.మహాదేవుని ఆలయంలో “ఓం నమశ్శివాయ” నినాదాలతో భక్తులు ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. కొందరు ఉపవాస దీక్షలు, కొందరు రుద్రాభిషేకాలు, పూజా కార్యక్రమాలతో పాల్గొని భక్తి భావాన్ని ప్రదర్శించారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి వచ్చి, భక్తి శ్రద్ధలతో శివుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు పూలతో, దీపాలతో అలంకరించబడ్డాయి.

# పారిశుధ్య కార్మికులకు రైన్ కోట్లు పంపిణీ

* వారే పట్టణ పరిశుభ్రత కాపాడుతున్న వాస్తవ వీరులు -అధికారులు

**అమలాపురం రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:**వర్షాకాలంలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య సిబ్బంది భద్రతను దృష్టిలో పెట్టుకుని రైన్ కోట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదేశాల మేరకు అమలాపురం పురపాలక సంఘంలో పనిచేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్ చేతుల మీదుగా రైన్ కోట్లు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, వర్షపు కష్టాలు పట్టించుకోకుండా ప్రజా సేవలో ముందుండే పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం, భద్రతపై సంరక్షణ అవసరమని పేర్కొన్నారు. మిగిలిన సిబ్బందికి కూడా త్వరలోనే రైన్ కోట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.పట్టణ పరిశుభ్రతను మరింత బలోపేతం చేయడానికి పారిశుధ్య సిబ్బందికి అవసరమైన పనిముట్లు, పరికరాలు పూర్తి స్థాయిలో అందజేసినట్టు కమిషనర్ తెలిపారు. తుఫాన్ ప్రభావ సమయంలో ప్రజలకు ఎప్పుడూ అండగా నిలిచి సేవలు అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు



**మాధవధార, పెన్ పవర్ అక్టోబరు 27**:, ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు సందర్భంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లాలో 100 ఉచిత మెడికల్ క్యాంపెన్స్ జరిగినాయి. అందులో భాగంగా మాధవధార మండలం 50వ వార్డు మురళి నగర్ బృందావన్ పార్క్ లో ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి ఎస్ ఎన్ రాజు, అలాగే మెడికల్ సిబ్బంది, ఆర్ఎస్ఎస్ మురళి నగర్ స్వయం సేవకులు, మరియు బిజెపి సీనియర్ నాయకులు పృధ్విరాజ్ ,సనపల నరసింహమూర్తి న్యాయ నిపుణులు, బిజెపి సీనియర్ నాయకులు సనపల రామకృష్ణ , బిజెపి 50 వ వార్డ్ అధ్యక్షులు కూన వెంకటరావు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కోన వెంకట్రావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ద్వారా ఇటువంటి సేవా కార్యక్రమాలలో భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందని. రానున్న రోజుల్లో వార్డులో మరిన్ని సేవా కార్యక్రమాలు జరిగేలా చొరవ తీసుకుంటాను అన్నారు. ఈ వైద్య శిబిరంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న స్థానికులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ 50వ అధ్యక్షులు సనపల వరప్రసాద్ , బిజెపి మార్కెటింగ్ డైరెక్టర్ టి పద్మజ ,మాధవధార మండల అధ్యక్షులు బిజెపి సత్తారు రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ 50వ వార్డు మహిళా అధ్యక్షురాలు పి పుణ్యావతి , హెచ్ జోగారావు ,బిజెపి మూల అప్పారావు , బృందావన్ పార్క్ అధ్యక్షులు మురళి, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మొంథా తుపాన్ ప్రభావంపై ప్రభుత్వ విప్ గణబాబు హెచ్చరిక




**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 27 :** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ‘మొంథా’ తుపాన్ ప్రభావం రాబోయే మూడు నుండి నాలుగు రోజులపాటు కొనసాగుతుందని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. ఈ తుపాన్ ప్రభావంతో తీరప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా గణబాబు పేర్కొన్నట్లుగా, ప్రస్తుత వాతావరణం ప్రశాంతంగా కనిపించినప్పటికీ ప్రజలు అశ్రద్ధగా వ్యవహరించరాదు. తుపాన్ తీవ్రస్థాయి దిశగా మారే అవకాశం ఉన్నందున ముఖ్యంగా తీర ప్రాంతాలు, కొండవారి ప్రాంతాలు, తక్కువ భూమి స్థాయి ప్రాంతాలలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి అని ఆయన సూచించారు. తుపాన్ ప్రభావం వల్ల వర్షాలు, గాలులు, సముద్రం అలజడి పెరిగే అవకాశాలు ఉన్నాయని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని ఆయన కోరారు. అలాగే, అధికారులు ఇప్పటికే రక్షణ చర్యలు, సహాయక బృందాల సిద్ధత పై పర్యవేక్షణ ప్రారంభించారని తెలిపారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు మరియు ప్రజాప్రతినిధులు ప్రజలతో నిరంతర సంబంధం ఉంచి, అవసరమైన సహాయక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు అండగా ఉండాలని తెలిపారు. తుపాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు స్థానిక అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

# ఊపందిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం

* కోటి సంతకాల సేకరణలో పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యం
* ముఖ్య అతిథిగా పాల్గొన్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్





**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 27 :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గంలో వేగం పుంజుకుంది. పెందుర్తి మండలం చింతగట్ల గ్రామంలో మాజీ ఉప సర్పంచ్, మండల ఉపాధ్యక్షులు గొంప అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన “రచ్చబండ” కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త మరియు రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ “ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో, ప్రైవేటీకరణ ప్రజా ఆరోగ్య హక్కును దెబ్బతీస్తుంది. ప్రతి సంతకం ప్రజా వైద్య హక్కుల రక్షణకు ఒక బలమైన స్వరం అవుతుందని అన్నారు. గత ప్రభుత్వం కాలంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు వాటి ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. కొత్తగా ఎన్నికైన మండల ఉపాధ్యక్షులు గొంప అప్పారావు, కార్యకర్త గనిశెట్టి కనకరాజులను దుశాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఉప్పిలి కనకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గోరపల్లి శ్రీను, నాయకులు ఐడి బాబు, ఇప్పిలి అప్పారావు, గొంప క్షీరసాగర్, వెంకటరావు, కిలానీ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక ప్రజలు తమ సంతకాల ద్వారా ప్రభుత్వ వైద్య విద్య, ప్రజా ఆసుపత్రుల పరిరక్షణకు మద్దతు తెలిపిన ఈ రచ్చబండ కార్యక్రమం ప్రజా చైతన్యానికి సంకేతమని, భవిష్యత్తులో ఇలాంటి ప్రజా ఉద్యమాలు మరింత బలంగా కొనసాగాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

# ప్రాథమిక పాఠశాల గోడ వీరిగిపడి ప్రమాదం







**ఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గణబాబు**

**ఎన్ఏడి, పెన్ పవర్, అక్టోబర్ 27 :** మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలోని జీవీఎంసీ 57వ వార్డు, సుభాష్ నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ వీరిగిపడిన ఘటన స్థానిక ప్రజల్లో ఆందోళనకు కారణమైంది. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఈ ఘటనపై వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ మరియు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు సోమవారం పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే స్థానిక అధికారులతో, విద్యాశాఖ ఇంజినీరింగ్ విభాగంతో మాట్లాడి ప్రహరీ గోడ పునర్నిర్మాణం, భద్రతా చర్యలు, తాత్కాలిక రక్షణ ఏర్పాట్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “పిల్లల భద్రతకు ఎలాంటి ప్రమాదం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలి. పాఠశాలలు సురక్షితంగా ఉండేలా అవసరమైన బడ్జెట్ కేటాయింపులు కూడా చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో 57వ వార్డు అధ్యక్షులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు, 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ, క్లస్టర్ ఇంచార్జి గిరి రాజు, తెలుగు యువత అధ్యక్షులు సేనాపతి సురేష్, దేవి, దివ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యే గణబాబు తక్షణ స్పందనను అభినందించారు.

# ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణాన్ని కాపాడుకుందాం






* అవగాహన కార్యక్రమంలో నందవరపు సోములు పిలుపు

**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 27 :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూమి భవిష్యత్తును కాపాడగలమని పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు నందవరపు సోములు పిలుపునిచ్చారు. గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం స్థాపనకు 37 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో పర్యావరణ సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంచడమే లక్ష్యంగా చేపట్టబడింది.

ఈ సందర్భంగా అధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడుతూ "ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టం తీవ్రమైనది. మన ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, నిషేధిత ప్లాస్టిక్ సంచులను పూర్తిగా వాడకపోవడం, వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం వంటివి ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. గౌరవ అధ్యక్షులు సాలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని, ప్రకృతి సంరక్షణకు సమాజం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు కంపర అప్పారావు "మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడంలో కూడా శ్రద్ధ అవసరం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలి" అన్నారు. ప్రధాన కార్యదర్శి రొంగలి ప్రసాద్ మాట్లాడుతూ

"నాణ్యతలేని ప్లాస్టిక్ సంచులతో పాటు పేపర్ టీ గ్లాసులు కూడా ఆరోగ్యానికి హానికరం. వీటి వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు ఉంది. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, కంచిపాటి వెంకటరమణ, కట్ట పెంటయ్య, కంపర కనకరాజు తదితరులు ప్రసంగించి పర్యావరణ పరిరక్షణలో గ్రామస్థుల పాత్రను వివరించారు. సంఘం 37 ఏళ్లుగా గ్రామ అభ్యుదయానికి, సామాజిక సేవలకు నడుం బిగించి పనిచేస్తున్నందుకు అధ్యక్షుడు నందవరపు సోములును సభ్యులు అభినందించారు.

అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గ్రామీణ స్థాయిలో పర్యావరణ అవగాహనను పెంపొందించడానికి ఒక మంచి ఉదాహరణ. ప్లాస్టిక్ నిషేధం, వృక్షారోపణ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ వంటి అంశాలను సమన్వయంగా చర్చించడం ప్రత్యేకత. యువజన సంఘం వంటి స్థానిక సంస్థలు సామాజిక మార్పుకు శక్తివంతమైన వేదికలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి చైతన్య కార్యక్రమాలు గ్రామ స్థాయిలో నిరంతరంగా కొనసాగితే పర్యావరణ పరిరక్షణలో దీర్ఘకాలిక ఫలితాలు సాధ్యమవుతాయి. "ప్లాస్టిక్‌ను విడనాడండి ः పర్యావరణాన్ని పరిరక్షించండి" అన్న నినాదం కేవలం మాటగాక, ప్రతి పౌరుడి జీవన విధానంగా మారాలని, ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత అని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

# వాయుగుండం నేపథ్యంలో పెందుర్తి ప్రజలకు ఎమ్మెల్యే పంచకర్ల విజ్ఞప్తి



**పెందుర్తి, పెన్ పవర్, అక్టోబర్ 27 :** ప్రస్తుత వాయుగుండం, మోంథా తుఫాను హెచ్చరిక నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గ ప్రజలందరూ అప్రమత్తంగా, ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక అత్యవసర ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఎమ్మెల్యే రమేష్ బాబు పేర్కొంటూ వర్షాలు, గాలులు తీవ్రంగా ఉండే అవకాశమున్నందున ప్రజలు తప్పనిసరిగా తమ ఇళ్లలోనే ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించారు. "రోడ్లపై నీరు చేరడం, విద్యుత్ వైర్లు తెగిపడడం వంటి ప్రమాదాలు ఉండే అవకాశం ఉంది. కనుక జాగ్రత్తలు తప్పనిసరి," అని ఆయన హెచ్చరించారు. మత్స్యకార గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. తుఫాను పరిస్థితులు పూర్తిగా సద్దుమణిగే వరకు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని సూచించారు. "జీవితమే ముఖ్యం, వేట ఎప్పుడైనా చేయొచ్చు" అని గుర్తుచేశారు. ఎక్కడైనా చెట్లు కూలడం, వరద నీరు చేరడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక అధికారులు లేదా సిబ్బందికి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. "ఇది ఒక ప్రకృతి విపత్తు, అందరూ బాధ్యతగా వ్యవహరించి ఒకరికి ఒకరు సహకరించాలి," అని ఆయన అన్నారు. ప్రజల్లో భయం వ్యాప్తి చెందకుండా నాయకులు ధైర్యం నింపేలా వ్యవహరించాలని సూచించారు. పెందుర్తి నియోజకవర్గంలోని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి శ్రేణుల నాయకులు మూడు రోజుల పాటు తమ తమ గ్రామాలు, వార్డుల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని పంచకర్ల రమేష్ బాబు సూచించారు. సహాయక చర్యల్లో పాల్గొని, ప్రజల్లో అవగాహన కల్పించడమే కాక, మానసిక స్థైర్యం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. "మనందరం కలిసికట్టుగా ఉంటే ఏ తుఫానూ మన మనోబలాన్ని దెబ్బతీయలేదు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండి, జాగ్రత్తలు పాటించండి," అని రమేష్ బాబు గారు ప్రజలను ఉద్దేశించి విజ్ఞప్తి చేశారు.ం

# ముంపు ప్రమాద గ్రామాలపై సమీక్ష ముందస్తు చర్యలకు ఆదేశాలు

పద్మనాభం మండలంలో ప్రత్యేక అధికారి జ్ఞానవేణి పర్యటన





**పద్మనాభం,పెన్ పవర్, అక్టోబర్ 27 :**మెంథా తుఫాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో, పద్మనా భం మండలంలోని లోతట్టు ప్రాంతాలను మండల ప్రత్యేక అధికారి జ్ఞానవేణి సోమవా రం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె ముం పు ప్రమాదం ఉండే గ్రామాలను సందర్శించి, స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. పునరా వాసం అవసరమయ్యే పరిస్థితులు తలెత్తిన పుడు తక్షణమే చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ శాఖ, గ్రామస్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆమె అధికారులను ఆదేశించారు.

తదనంతరం మండల కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్ కే. ఆనంద రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. శ్యామల తదితర అధికారులు పాల్గొన్నారు. జ్ఞానవేణి గారు సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ప్రాణ రక్షణే ప్రాధాన్యం. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే గ్రామాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి" అని స్పష్టం చేశారు.

అధికారులు ముంపు ప్రభావిత గ్రామాల పరిస్థితులను సమీక్షించి, అవసరమైన సహాయక చర్యలను అమలు చేయాలని సూచనలు జారీ చేశారు.

# మెంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు




**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 27:-** మెంథా తుఫాను నేపథ్యంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు విజ్ఞప్తి చేస్తున్నారు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అల్పపీడన ప్రభావం కారణంగా ఈదురు గాలులు, భారీ వర్షాలతో విపత్కర పరిస్థితులు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.లోతట్టు ప్రాంతాల్లో గాని పాడుపడిన నిర్మాణాలు గానీ ఎవరూ ఉండరాదని, అత్యవసర సమయాలలో టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. వారు .

# కే.జీ.హెచ్ కి 40 లక్షల విలువైన వైద్య పరికరాల అందజేత

ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతులమీదగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమం










**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 27. :**విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆసుపత్రి కు రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో 40 లక్షల రూపా యల విలువైన ఆధునిక వైద్య పరికరాలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీని వాస్ చేతుల మీదగా అందజేశారు.ఈ సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, "రోటరీ క్లబ్ సమా జానికి సేవలందించే వేదికగా నిలుస్తోంది. ఈ సంస్థ చేపడుతున్న వైద్య, విద్యా కార్యక్రమాలు ప్రశంసనీయమైనవి" అని తెలిపారు. నియోజకవర్గంలో విద్యా రంగం, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, రోటరీ సభ్యులు పాఠశాలలు, కళాశాలలకు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ సందర్భంగా 2 వెంటిలేటర్లు, 10 సిరంజ్ పంపులు, 40 వీల్‌చైర్లు, 100 కాట్లు, 5 రెస్పి రేటరీ హ్యూమిడిఫయర్లు కేజీహెచ్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, రోటరీ క్లబ్ పెద్దలు శోభన్ ప్రకాష్, ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, సభ్యులు రాంప్రసాద్, నహదా, కృష్ణకుమార్, జనసేన పార్టీ వార్డ్ అధ్యక్షురాలు యజ్ఞశ్రీ, కూటమి నేతలు జోగి రాజు, మహి, డిప్యూటీ సూపరింటెండెంట్ వాసవి లత, సీఎంఆర్వో శ్రీహరి, ఏవో మరియు పలు విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

# "మెంథా తుఫాన్‌లో ప్రజలతో వాసుపల్లి వర్షంలోనూ సేవలతో ముందుకు"

* లోతట్టు ప్రాంత ప్రజలకు నిత్యావసరాల పంపిణీ
* మత్స్యకారులందరికీ 50 కేజీల రేషన్ ఇవ్వాలని డిమాండ్





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 27 :**మెంథా తుఫాను ప్రభావంతో తీరప్రాంతాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మె ల్యే, వైఎస్సార్సీపీ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజలకు అండగా నిలిచారు. వర్షాన్ని లెక్కచేయకుండా తడుస్తూ, 35వ వార్డు లక్ష్మీన గర్ లోతట్టు ప్రాంత ప్రజలకు స్వయంగా నిత్యా వసరాలను అందించారు.వార్డ్ అధ్యక్షుడు అలు పున కనకరెడ్డి, సీనియర్ నాయకులు సమక్షం లో జరిగిన ఈ కార్యక్రమంలో 250 కుటుంబా లకు రూ.500 విలువచేసే కిట్లను పంపిణీ చేశా రు. ఇందులో మూడు కేజీల బియ్యం, కూరగా యలు, వంటనూనె, మాంసం వంటి నిత్యావస రాలు ఉన్నాయి.ఈ సందర్భంగా మాట్లాడిన వాసుపల్లి గణేష్ కుమార్,మెంథా తుఫాను తీరం దాటే సమయంలో ఈదురుగాలులు బలంగా వీస్తాయి. లోతట్టు ప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే ఇంటి నుండి బయటకు రావద్దు. అందుకే ప్రజల అవసరాలు ఇంటి వద్దకే తీసుకెళ్తున్నాం అని అన్నారు.

తుఫాను సమయంలో ప్రజలకు సేవ చేయడం రాజకీయ ప్రయోజనం కోసం కాదని, ఇది మా నవతా ధర్మమని ఆయన స్పష్టం చేశారు. "మా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి పిలుపుమేరకు వైఎస్సార్సీపీ కుటుంబం మొత్తం ప్రజలతో కలిసి ఉంది. ప్రభుత్వం పిలిస్తే సేవా సైనికుల్లా తుఫా ను పరిస్థితుల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాం అని తెలిపారు.తీరప్రాంత మత్స్యకా రుల పరిస్థితిని ప్రస్తావిస్తూ, ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి కనీసం 50 కేజీల బియ్యం, రేషన్ ఉచితంగా ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు. దక్షిణ నియోజ కవర్గంలో ఎవరికైనా సహాయం అవసరమైతే నేను అందుబాటులో ఉంటాను" అని వాసుపల్లి అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నా జానకిరామ్, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి అడివిషు, మాజీ కార్పొరేటర్ పచ్చిరపల్లి రాము, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సువార్త రాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భారత్, వార్డ్ అధ్యక్షులు పీతల వాసు, రాజా రెడ్డి, ముత్తబాతులు రమేష్, లండ రమణ తదితర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# “మొంథా తుఫాన్” కారణంగా పలు రైళ్ల రద్దు





**భారీ వర్షాలు,ప్రయాణికుల భద్రతా కారణంగా పలు రైలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 27:**ప్రయాణికుల భద్రత దృష్ట్యా తుఫాను భారీ వర్షాల కారణంగా క్రింది రైళ్లు రద్దు చేయబడ్డాయని ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రకటన ద్వారా తెలియజేశారు.

రద్దు తేదీలు: 27, 28 %డ% 29 అక్టోబర్ 2025 వరకు

రద్దయిన రైళ్లు వివరములు

1. 18515 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (27.10)
2. 18516 కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (28.10)
3. 58501 విశాఖ-కిరండూల్ ప్యాసింజర్ (28.10)
4. 58502 కిరండూల్-విశాఖ ప్యాసింజర్ (28.10)
5. 58538 విశాఖ-కొరాపుట్ ప్యాసింజర్ (28.10)
6. 58537 కొరాపుట్-విశాఖ ప్యాసింజర్ (28.10)
7. 18512విశాఖ-ఎక్స్‌ప్రెస్ (27.10)
8.18511 కొరాపుట్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (28.10)
9.67285 రాజమండ్రి-విశాఖ వీజువీఖ (28.10)
10.67286 విశాఖ-రాజమండ్రి వీజువీఖ (28.10)
11 17268 విశాఖ-కాకినాడ ఎక్స్‌ప్రెస్ (28.10)
12. 17267 కాకినాడ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (28.10)13. 08583 విశాఖ-తిరుపతి స్పెషల్ (27.10)
14. 08584 తిరుపతి-విశాఖ స్పెషల్ (28.10)
15. 22875 విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ (28.10)
16. 22876 గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ (28.10)
17. 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (27.10)
18. 18526 విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (27.10)
19. 18525 బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (28.10)
20. 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ (27.10)
22. 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (27.10)
22. 67289 విశాఖ-పాలసా వీజువీఖ (28.10)
%23. 67290 పాలసా-విశాఖ (28.10)
24. 67287 విశాఖ-విజయనగరం (27.10)
25. 25. 67288 విజయనగరం-విశాఖ వీజువీఖ (28.10)
26. 68433 కటక్-గునుపూర్ వీజువీఖ (28.10)27. 68434 గునుపూర్-కటక్ వీజువీఖ (29.10)
%28. 58531 బ్రహ్మపూర్-విశాఖ ప్యాసింజర్ (28.10)
29. 58532 విశాఖ-బ్రహ్మపూర్ ప్యాసింజర్ (28.10)
30. 58506 విశాఖ-గునుపూర్ ప్యాసింజర్ (28.10)
31. 58505 గునుపూర్-విశాఖ ప్యాసింజర్ (28.10)
.32. 17220 విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (27.10)
33. 12727 విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (27.10)
34. 12861 విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (27.10)
35. 12862 మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (28.10)
36 .22869 విశాఖ-చెన్నై సెంట్రల్ వీక్లీ (27.10
37 . 22870 చెన్నై సెంట్రల్-విశాఖ వీక్లీ (28.10)
38. 12739 విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రత్ (27.10)
39. 20805 విశాఖ-న్యూఢిల్లీ ఏపీ సూపర్‌ఫాస్ట్ (27.10)
40. 20806 న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (29.10)
41. 22707 విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (27.10)42. 18519 విశాఖ-ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్ (27.10)
43. 18520 ఎల్‌టిటి-విశాఖ ఎక్స్‌ప్రెస్ (29.10)

ప్రయాణికులు అధికారిక రైల్వే వెబ్‌సైట్ లేదా సమీప విచారణ కార్యాలయంలో రైలు స్థితి తనిఖీ చేసుకోవచ్చు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమ జ్వాల

* కోటి సంతకాల సేకరణలో ఉత్సాహం





**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 27 :**ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖపట్నం జిల్లాలో కోటి సం తకాల సేకరణ కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. పశ్చిమ నియోజకవర్గంలోని కోరమండల్ గేట్ ఎదురుగా జరిగిన ఈ సంత కాల సేకరణలో కార్మికులు, విద్యార్థులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సా ర్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ళ విజయ ప్రసాద్ సారథ్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పి. గౌతంరెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షులు మరియు ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు హాజరై ప్రజల నుండి సంతకాలను స్వీకరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయ కులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రజల ఆరోగ్య హక్కులను దెబ్బతీసే చర్య అని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ద్వారానే పేదల ఆరోగ్యం కాపాడగలమని పేర్కొన్నారు. కోటి సంతకాల సేకరణ ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోనల్ మరియు జిల్లా అధ్యక్షులు పి.వి. సురేష్, రాయపురెడ్డి అనిల్, కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, పార్టీ జోనల్ అధ్యక్షులు అంబటి శైలేష్, యం. సునీల్ కుమార్, వార్డు అధ్యక్షులు అంగ వర్మ, పిలక రాము, బీశెట్టి గణేష్, వై. రాజు, రేవల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్‌కు ముందే గరిష్ట స్థాయికి చేరిన డొంకరాయి జలాశయం

* 7 గేట్ల ద్వారా 15,000 క్యూసెక్కుల నీటిని విడుదల



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:**అల్లూరి జిల్లా డొంకరాయి జలాశయం ప్రస్తుతం గరిష్ట స్థాయి దగ్గరకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు ఉండగా, జలాశయం ప్రస్తుతం 1034.50 అడుగుల వద్ద ఉంది. ఈ నేపథ్యంగా ఏపీ జెన్‌కో అధికారులు సోమవారం 7 గేట్లు ఎత్తి 15,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మొంథా తుఫాన్ రాకకు ముందు జలాశయం నీటిమట్టం పెరిగిందని, జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం నీటిమట్టం తగ్గేవరకు ఈ నీటి విడుదల కొనసాగుతుందని వారు తెలిపారు.

## కార్తీకమాసం తొలి సోమవారం దారకొండ,సీలేరులో భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు, దారకొండ గ్రామాల్లో కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయం త్వరగా దేవాలయాలకు చేరుకుని కార్తీక స్నానాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సీలేరులోని శివాలయంలో స్థానిక భక్తులు కార్తీక దీపాలను వెలిగించి, శివభక్తికి ఆనందభరిత వాతావరణాన్ని సృష్టించారు. దారకొండ శివాలయంలో తెల్లవారు జామునే స్నానాలు మరియు ప్రత్యేక పూజలు జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్, ఎస్‌ఎస్‌ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో హరి భజనలు కూడా జరిగింది. కార్యక్రమంలో దారకొండ, ఏనుగుబైలు, చింతలవీధి గ్రామాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక మాస మహోత్సవాలు

-శ్రీ గౌరీ పరమేశ్వర సాహిత్య ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం..





**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 27 :**అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఆరిపాక పంచాయతీ యాతపాలెం గ్రామంలో గల శ్రీ గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం లో కార్తీక మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహి%శీ%చారు .అక్టోబర్ 22వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుంచి ప్రత్యేక అభిషేకములు, రుద్రభిషేకములు ధూప,దీప నైవేద్యములతో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖ డైరీ డైరెక్టర్, ఆలయ వ్యవస్థాపకులు సరగడం శంకర్రావు మాట్లాడుతూ గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం నిత్యం భక్తులతో మహా పుణ్యక్షేత్రంగా వెదజల్లుతోందని తెలిపారు. జ్యోతి లింగ క్షేత్రలలో అర్చకులు పూజలు నిర్వహిస్తారని, మాక్షేత్రంలో కుటుంబ సమేతంగా జ్యోతిర్లింగాలకు పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కార్తీక మాసం, శివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తామని, నవంబర్ 5వ తేదీన కార్తీక పౌర్ణమి రోజున జ్వాలతోరణం, 25 లక్షల మహాదేవార్చన, సప్తహారతి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్తీక మాసంలో ఒకేసారి 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు దర్శించు కోవడంతోపాటు భక్తులు స్వహస్తాలతో పంచమృత అభిషేకములు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. భక్తుల ముందుగా గౌరీ పరమేశ్వరులకు పూజ నిర్వహించి అనంతరం కోనేరుకు ఆనుకొనున్న జ్యోతిర్లింగాలకు పూజలు నిర్వహించుకుంటారని తెలిపారు. భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించామని తెలిపారు. కార్తీక మాస మహోత్సవాలతో గౌరీ పరమేశ్వర సహిత ద్వాదశ జ్యోతిర్లింగలక్షేత్రంతోపాటు ఈ గ్రామానికి ఆనుకొని ఉన్న అన్ని గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి.

## రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం. కొమరాడ అక్టోబర్ 27. పెన్ పవర్.** కొమరాడ మండలం కెమిశీల గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శేఖర్ పాత్రుడు,ఏఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్రావు, హరిప్రసాద్,రాఘవ, బలరాం,నాగేశ్వరావు, జనసేన కన్వీనర్ శ్రీకర్,బిజెపి కన్వీనర్ సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లబ్బూరు ఏకలవ్యలో నీటి సమస్యపై రాష్ట్ర ఏకలవ్య కన్సల్టెంట్ కృష్ణారావు సందర్శన

* సుమారు 40 లక్షలతో జోలపుట్టు రిజర్వాయర్ నుండి నీటి సేకరణకు కలెక్టర్ కు నివేదిక.
* నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాము.
* నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైనంత వరకు ట్యాంకర్ల ద్వారా ఏకలవ్యలో నీటిని సరఫరా చేస్తామని వెల్లడి.







**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 27.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, జోలాపుట్టు పంచాయతీ, లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నెల కొన్న త్రాగు నీటి సమస్యపై నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఆంధ్రప్రదేశ్ కన్సల్టెంట్(ఎన్ఎస్టిఎస్) జి కృష్ణరావు సోమవారం పర్యటించి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్బూరు ఏకలవ్యలో నీటి సమస్య తీవ్రతపై గత కొన్ని రోజులుగా వివిధ పత్రికలలో వార్త కథనాలను వెలువడడం, నీటి సమస్యలపై విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలియజేయడంపై జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏకలవ్య పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు సందర్శిస్తున్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఏకలవ్య కన్సల్టెన్సీ జి కృష్ణరావు సందర్శించి పాఠశాల పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 40 లక్షలతో నీటి సౌకర్యం కల్పనకు ప్రభుత్వానికి ప్రతి పాదన పంపిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రస్తుతానికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు సరిపడ్డ నీటిని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి, సెంట్రల్ గవర్నమెంట్ కు నివేదిక సమర్పిస్తామని ఆయన తెలిపారు. త్రాగు నీటి సమస్య పరిష్కరించాలని పాఠశాల తల్లిదండ్రులు ఈఎమ్మార్స్ కన్సల్టెంట్ కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని, నీటి సమస్య త్వరలోనే పరిష్కరిస్తామని తల్లిదండ్రులకు ఆయన హామీ ఇచ్చారు. జోలపుట్టు రిజర్వాయర్ నుండి పాఠశాలలో నీటిని అందించుటకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఓఎస్డి మూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్, తల్లితండ్రుల కమిటీ చైర్మన్ రామదాసు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# “మొంథా”లితుఫాన్ ముంచేస్తుంది





* ఎడతెరపి లేని వర్షాలకు స్తంభించిన జనజీవనం
* పునరావాస కేంద్ర ప్రభుత్వ పిలుస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**విశాఖ తూర్పు పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబరు 27:** తుఫానుగా మారిన “మొంథా”ప్రభావాన్ని చూపిస్తుంది ఎడతెరపి లేని వర్షాలకు నగర జనజీవనపు స్తంభించింది. ప్రభుత్వ హెచ్చరికల మా నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించుగా విద్యా సంస్థలు మూతపడగా అక్కడక్కడ విద్య సంస్థలు వివిధ కారణాలు చూపి విద్యార్థులు తరగతులకు హాజరయ్యారు. తుఫాను నేపథ్యంలో ప్రభుత్వ హెచ్చరికలతో ప్రజలు ఇళ్ళకె పరిమితమయ్యారు నిత్యవసర వస్తువులు,పాలు కూరగాయల కోసం బయటకు రావడం జరిగింది.

ప్రభుత్వాధికారులు జీవీఎంసీ సిబ్బంది పునరావాస కేంద్రాలలో ఏర్పాటులను చేశారు. జీవీఎంసీ ఇతర విభాగాల అధికారులు తమ సిబ్బందిని అత్యవసర సేవలు కోసం ప్రభుత్వం చేసి ప్రజలకు ఎప్పటికప్పుడు తుఫాను హెచ్చరికలకు జారీ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు.జీవీఎంసీ నిరంతరాయంగా త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై, రెవెన్యూ మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి తుఫాను ప్రభావిత ప్రాంతాలలో అత్యవసర సమయంలో తమ సేవలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. తుఫాను ప్రభావం భారీగా ఉండడంతో ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు నిత్యవసర వస్తువులు రైతుబజార్లు సివిల్ సప్లై ద్వారా అందించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు పడ్డ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ముందస్తు సమాచారం పక్క ప్రణాళికల ద్వారా యంత్రాంగం పనిచేయడంతో ప్రజల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ 2 13వ వార్డు కనకమహాలక్ష్మి నగర్ లో మార్కెట్ షెడ్లలో నివసిస్తున్న వారిని భారీ వర్షాల కారణంగా జీవీఎంసీ సీఈవో అప్పలకొండ నిర్వాసితులను పునరావస కేంద్రాలకు తరలించారు కొందరు పునరావాసు కేంద్రాలకు వెళ్లేందుకు నిరాకరించిన వారికి నచ్చజెప్పి ఎందుకు ప్రయత్నించిన వినకపోవడంతో పై అధికారులకు ఆమె తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా హెల్ప్ లైన్ సెంటర్లను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు బిటోల్ ఫ్రీ 1800 42509, 0891 2507225,

జోన్ 1 08933 229535
జోన్ 2.0891 2715716,
జోన్ 3, 0891 274631.
జోన్ 4. 0891 2590114.
జోన్ 5.0891 2711480.
జోన్ 6.0891 2753535
జాన్ 7.08924 222747
జోన్ 8.0891 2735353.

ఈ నెంబర్లను అత్యవసర సమయంలో ప్రజలు ఉపయోగించుకోవచ్చునని అధికారులు తెలియజేశారు.



## అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇల్లు నుంచి బయటకు రావద్దు

* సీలేరు ఎస్సై ఎండి.యాసిన్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, అక్టోబర్ 27:** మొంథా తుఫాన్ దృష్ట్యా సీలేరు పరిసర ప్రాంతాలు, పంచాయతీ ప్రజలకు ఎస్ఐ ఎండి యాసిన్ అప్రమత్తత చేస్తూ సూచనలు ఇచ్చారు. సీలేరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.డి. యాసిన్ సోమవారం ఒక ప్రకటనలో, అత్యవసర పరిస్థితులలో తప్పా ఇల్లు నుండి బయటకు రావద్దని హెచ్చరించారు. తుఫాన్ వలన రహదారులకు అంతరాయం ఏర్పడిన లేదా ఏవైనా విపత్తులు సంభవించినా వెంటనే సీలేరు పోలీస్ స్టేషన్ (ఫోన్: 9440904234) కి సమాచారం అందించాలని సూచించారు. ప్రజలు వారి ప్రాణ, ఆస్తి నష్టం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు ఇచ్చిన సూచనలను కట్టుబడి పాటించమని ఎస్ఐ యాసిన్ తెలిపారు.

## 3 కోట్ల రూపాయిలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన






**గాజువాక: పెన్ పవర్ ,అక్టోబర్ 27** కూటమి పాలనలో రాష్ట్ర%శీ% ప్రగతి పథంలో పరుగులు తీస్తుందని రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు.జీవీఎంసీ 86 వ వార్డు రాజీవ్ నగర్ రాసాలమ్మ కాలనీ ప్రాంతాల్లో సుమారు 3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.ప్రతి వార్డును ఆదర్శ%శీ%గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.గత వైసీపీ పాలనలో టీడీపీ కార్పొరేటర్లు ఉన్న వార్డుల్లో అభివృద్ధి అన్నది అంతంతమాత్రంగానే ఉందని అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని వార్డులను ఒకేలా చూస్తూ నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 86 వ వార్డులో దాదాపుగా అన్ని పనులు చివరి దశకు చేరుకున్నాయని అన్నారు.ప్రజలు కూడా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నియోజకవర్గ సామానవ్యకర్త, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, వార్డు టీడీపి అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ,వార్డు జనసేన అధ్యక్షుడు కాదా శ్రీను ,టీడీపీ క్లస్టర్ ఇంచార్జి వేగుంట శ్రీనివాస్,. వార్డు సెక్రటరీ జగదీష్, ,వైస్ ప్రెసిడెంట్ రమేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గణపతి,వార్డు నాయకులు సుబ్బయ్య, త్రినాధ్,వెంకటేష్,గోవింద్ ప్రాధన్, వీర భద్రరావు, నాయుడు, సింహాద్రి, సుందరరావు, వరహాలరావు,బి. అప్పారావు, నూక అప్పారావు, కృష్ణప్రసాద్, బాలకృష్ణ, సత్య.తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో గిరిజన క్రీడాకారులు గోల్డ్ మెడల్స్

అల్లూరి సీతారామరాజు జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ కుర్తాడి ప్రసాద్.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 27.** విశాఖ ఉమ్మడి జిల్లాలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్టు డాక్టర్ కమల్ బైడి, డాక్టర్ మంగ వరప్రసాద్, జిల్లా సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ జిల్లా ఛాంపియన్ షిప్ 2025 పోలీస్ బేరక్స్ లో నిర్వహించిన అథ్లెటిక్ పోటీలో అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు, పెదబయలు డుంబ్రిగూడ, అరకు లోయ, హుకుంపేట మండలాలకు చెందిన మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో మెడల్స్ సాధించారని అల్లూరి జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి కుర్తాడి ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ కుర్తాడి 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంతో పాటు జావలిన్ త్రో లో మూడో స్థానం సాధించారని, బి గణేష్ నడక ఐదు కిలోమీటర్ల పోటీల్లో మొదటి స్థానం, లాంగ్ జంప్ లో మొదటి స్థానం సాధించారన్నారు. పి మహేష్ 800 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంతో పాటు జావెలిన్ త్రో రెండవ స్థానం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా టి మంగులు ట్రిపుల్ జంప్ మొదటి స్థానం తో పాటు 400పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచాడని, కె శత్రుజ్ఞ జావెలిన్ త్రో మొదటి స్థానం తో పాటు ట్రిపుల్ జంప్ లో మొదటి స్థానం సాధించారన్నారు. జావెలిన్ త్రో మొదటి స్థానం తో పాటు షాట్ పుట్ లో ఎస్ సిబో రెండవ స్థానంలో నిలవగా, మత్స్య కొండమ్మ జావెలిన్ త్రో మొదటి స్థానంతో పాటు షాట్ పుట్ మొదటి స్థానంలో సత్తా చాటారని పేర్కొన్నారు. మొత్తం 12 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంచ్ మెడల్ సాధించారని ఆయన తెలిపారు. డిసెంబర్ 13 14 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయిలో ఎన్నికైనట్లు కుర్తాడి ప్రసాద్ పేర్కొన్నారు.

## టిడిపి కార్యకర్తలకు వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని పల్లా భరోసా



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 27** మహా విశాఖ నగర పాలక సంస్థ 75వ వార్డు, పెదగంట్యాడ, దుర్గవాణి పాలెం గ్రామానికి చెందిన యలబిల్లి ఆకాష్ వయసు 18 సంవత్సరాలు ఆటోనగర్ ఇండస్ట్రీలో పనిచేస్తూ విద్యుత్ స్టాక్ తో అక్టోబర్ 20వ తారీఖున మరణించిన ఘటన విధితమే .

ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ 75 వార్డ్ నాయకులు వారి కుటుంబ సభ్యులకు తోడుగా ఉండి యాజమాన్యం నుండి ఆకాష్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి కలెక్టర్ ఏసిబి ,ఎమ్మార్వో కి సంప్రదింపులు జరిపి యాజమాన్యం నుండి 12 లక్షలు నష్టపరిహారం కుటుంబానికి వచ్చేలా కృషి చేశారు. మృతుడు కుటుంబాన్ని పరామర్శించి, తల్లిదండ్రులకి మనోధైర్యం చెప్పి, ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు, వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రమాద ఘటనను వివరించి తెలుగుదేశం పార్టీ నుండి ఆర్థిక సహాయం అందేలా చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ , ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు , వార్డు ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు, వంగలపూడి అప్పలరాజు, ఎల్లబిల్లి గోవిందు , నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ సన్నాహకాలు పర్యవేక్షణ

* ప్రజల భద్రతే ప్రాధాన్యం - రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**కాకినాడ రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రజలకు అందుతున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తో కలిసి సోమవారం పర్యటించారు. ముందుగా వారు కాకినాడ రూరల్, కరప మండలం పగడాలపేట ఉప్పలంక ప్రాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ప్రజల కోసం ఏర్పాటుచేసిన మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్తు, వైద్య శిబిరం, భోజన ఏర్పాట్లు వంటి అంశాలపై అధికారులు తీసుకున్న చర్యలను వివరంగా విచారించారు. పగడాల పేటలో పాకల్లో నివసిస్తున్న కుటుంబాల వద్దకు వెళ్లి తుఫాన్ తీవ్రత పెరగే అవకాశాలున్నందున ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని ప్రజలకు సూచించారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గేంతవరకు కేంద్రాల్లోనే సురక్షితంగా ఉండాలని అవగాహన కల్పించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజల ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్టు, పునరావాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, సీనియర్ నాయకుడు తోట నవీన్, కూటమి నాయకులు ఇతరులు పాల్గొన్నారు.



## తుఫాన్ హెచ్చరిక: అన్ని రైతు సేవా కేంద్రల సిబ్బంది అప్రమత్తతలో ఉండాలి

**జీకే వీధి మండల వ్యవసాయ అధికారి డి.గిరిబాబు**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ అక్టోబర్ 27:** "మొంథా తుఫాన్" కారణంగా గూడెం కొత్త వీధి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, సిబ్బంది అందరూ తమ సచివాలయం పరిధిలో అందుబాటులో ఉండాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు చేపట్టేలా సిబ్బంది గ్రామాల్లో రైతులకు తుఫాన్ హెచ్చరికలు అందించాలి. అలాగే రైతులకు పంట కోతలను వాయిదా వేయాలని, పొలాల్లో నీరు నిల్వగా ఉండకుండా చూసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఈ తుఫాన్ కారణంగా ఎలాంటి సెలవులు లేవని ఆయన వివరించారు.ఈ సూచనల ద్వారా తుఫాన్ ప్రభావాలను తగ్గించడానికి సిబ్బంది పూర్తి సన్నద్ధతలో ఉండాల్సి ఉంది.

## డెక్కన్ చాయ్ టీ స్టాల్ ప్రారంభించిన పల్లా





**పెన్ పవర్ అక్టోబర్ 27:** తేనేటి ప్రియుల కోసం మరింత కొత్త రుచులతో తేనేటిని అందించడానికి శ్రేయస్ గ్రూప్ సంస్థకు చెందిన డెక్కన్ టి స్టాల్ ను బీసీ రోడ్డు ఎన్టీఆర్ కూడలి లో ప్రారంభించారు. సోమవారం జరిగిన ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని ఆయన చేతుల మీదుగా డెక్కన్ చాయ్ టీ స్టాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రేష్టమైన రుచులతో ఏర్పాటుచేసిన ఈ డెక్కన్ చాట్ భవిష్యత్తులో మరిన్ని ఫ్రాంచీలు విస్తరింప చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు, వార్డు అధ్యక్షుడు రట్టి వాసు, 66వ వార్డు టిడిపి సీనియర్ నాయకుడు , వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, సింగూరు అనంత్, బైపిల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవరం జలపాతం దారి మూసివేత

* తుఫాను కారణంగా పర్యాటకులను నియంత్రించేందుకు కంచె ఏర్పాటు చేసిన గ్రామస్తులు



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 27:-** అల్పపీడనం కారణంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తమయ్యారు. పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన ఆంధ్ర కశ్మీర్ లోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లే రహదారులను తాత్కాలికంగా కంచెలు కట్టి ఆ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులను నిలువరించారు. ఇందులో భాగంగా చింతపల్లి మండలంలోని ఎర్రవరం జలపాతానికి పర్యాటకుల రాకపోకలను నియంత్రించేందుకు ఎర్రవరం గ్రామస్తులు కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలులు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యగా జలపాతాల వద్ద కంచె ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. రాబోవు రెండు రోజులపాటు కురిసే వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

# మొంథా తుఫానుతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి






* ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలి.
* కించాయిపుట్టు, పనసపుట్టు పంచాయతీల కార్యదర్శులు

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 27.**మొంథా తుఫాను కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలని కించాయిపుట్టు, పనసపుట్టు పంచాయతీల సెక్రటరీలు సింహాచలం, శెట్టి ప్రకాష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు సోమవారం మండల కేంద్రంలోనూ, పనసపుట్టు పంచాయితీ పరిధిలో గల కదుతుల, లుక్కూరు, టికరపడ తదితర గ్రామాలలో మైక్ ద్వారా ప్రజలకు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొంథా తుఫాను ప్రభావంతో 28, 29 తేదీలలో భారీ వర్షాలు కురుస్తాయని, తుఫాను ప్రభావం మన ప్రాంతంలో అధికముగా ఉండొచ్చు అన్నారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని వారు కోరారు. తుఫాను తగ్గే వరకు మూడు రోజుల్లో ఇంట్లోనే సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసరమైతేనే బయటికి రావాలని మైకు ద్వారా ప్రసారం నిర్వహించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోని ఉండాలని, బయట చెట్లకింద ఉండరాదని, ఎలాంటి సమస్య వచ్చిన మండల స్థాయి అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని తెలిపారు. తుఫాను నేపథ్యంలో మండల అధికారులు ప్రజలకు అప్రమత్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొంథా తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి.




**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 27:-** తుపాను కారణంగా భారీ వర్షాలు, గాలులు ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం నేపథ్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతీ కీలక ఆదేశాలు జారీ చేశారు.కళాశాల విద్యార్థినీ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. అలాగే పర్మిషన్ లేకుండా కళాశాల హాస్టల్ విడిచి బయటికి వెళ్ళకూడదని కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఏదైనా ప్రమాదకర విపత్తు జరిగిన ఎడల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ టీం సూచన.అలాగే మీ గ్రామాల్లో మీ తల్లిదండ్రులకు కూడా అప్రమత్తంగాఉండాలని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేయాలని సూచన.ప్రజలను గ్రామస్థాయిలోఅప్రమత్తంచేయాలి విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, వైద్య శాఖలు నిత్యంఅందుబాటులో ఉండాలి.ప్రమాదకర భవనాల్లో ఎవరూ ఉండరాదు.రైతుల పంటలు రక్షణకుముందస్తుచర్యలుతీసుకోవాలి.అదేవిధంగా పర్యాటక ప్రాంతాల్లో అక్టోబర్ 31 వరకు ప్రవేశం నిలిపివేశారు.ప్రజలు ఏవైనా అత్యవసర సమాచారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 7780292811, పాడేరు సమాచారం కొరకు 9440812511 కు సంప్రదించవచ్చు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి..!

**గిన్నెలకోట మరియు జామిగూడ పంచాయతీలలో స్థానిక సంస్థలు ఎన్నికలకు సన్నద్ధం అవ్వాలని టీడీపీ మండల కమిటి పిలుపు.**



**పెన్ పవర్ హుకుంపేట అక్టోబర్ 27**:కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం ఆరు నెలలు కావస్తు వస్తుంది ఈ ప్రభుత్వం అభివృద్ధి తో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తుందని టిడిపి పెదబయలు మండల అధ్యక్షులు వెచ్చంగి కొండయ్య తెలపడం జరిగింది ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు పైన పంచాయితీలో ఉన్న అన్ని గ్రామాలకు వెళ్లి అవగాహన పరిచి ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చి రాబోయే స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలకు కూటమి అభ్యర్థులను గెలిపించుకో వలసిన బాధ్యత గ్రామ కమిటీ కు మరియు సీనియర్ నాయకులకు కార్యకర్తలు తీసుకోవాలని కోరడం అయినది.

ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు వెచ్చంగి కొండయ్య, మరియు మండల ప్రధాన కార్యదర్శి కొర్ర రాజారావు మరియు అరుకు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోండా వినోద్ , మండల సీనియర్ నాయకులు, ఎక్స్ ఎంపీటీసీ ఉల్లి సింహాచలం మరియు గోమంగి పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గంపరాయి ధనుంజయ, గిన్నెలకోట ఎంపీటీసీ సభ్యురాలు గడుతూరి నిర్మల మరియు మాజీ సర్పంచ్ లకే చిన్నారావు మరియు కృష్ణ, నత్తూరి చిన్నారావ్, బుఠారి అప్పారావు, టిడిపి సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది.

## మొంథా తుపాన్ దూసుకొస్తోంది

**కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు - గంటకు 110కి.మీ వేగంతో ఈదురుగాలులు**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 27:**నైరుతి మరియు పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాన్ వేగంగా బలపడుతూ కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గడిచిన ఆరు గంటల్లో ఇది గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదిలిందని స్క్రోలింగ్ ద్వారా వెల్లడించింది. తాజా సమాచారం ప్రకారం తుపాన్, చెన్నైకి 440 కి.మీ, విశాఖపట్నంకి 530 కి.మీ కాకినాడకి 490 కి.మీ,దూరంలో కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతున్న మొంథా తుపాన్ రేపు ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.తుపాను తీరం దాటే సమయానికి కోస్తా జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయి. గంటకు 90-110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులుతీవ్రతరం అవుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ జాగ్రత్తలు సూచించారు. జాగ్రత్త సూచనలు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు.ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి.అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి పునరావాస ఏర్పాట్లు పూర్తి చేశామని ఎండీ పేర్కొన్నారు.

## పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం..





**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 27.పెన్ పవర్.**మండలంలో ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్లో ఎస్సై శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.స్థానిక ఏ.పీ.ఆర్.జె.సి విద్యార్థులకు ఆయుధాలను ఉపయోగించే విధానాన్ని ఎస్సై వివరించారు.రిసెప్షన్ హాల్,లాకప్ గదులను,కంప్యూటర్ సిస్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అలాగే వీ.హెచ్.ఎఫ్ కమ్యూనికేషన్ సెట్లో విద్యార్థులతో నేరుగా మాట్లాడించి అది పనిచేసే తీరుని వారికి అర్థమయ్యేలా వివరించారు.ఈ సందర్భంగా ఎస్సై శివప్రసాద్ విద్యార్థుల కు సూచనలు ఇస్తూ మాదక ద్రవ్యాలు.డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నేరాలకు పాల్పడకుండా క్రమశిక్షణతో చదువుకోని ప్రయోజకులు అవ్వాలని విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎస్.ఐ మహేశ్వరరావు,పోలీస్ సిబ్బంది మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు.

* అత్యవసరమైతేనే పాఠశాల నుంచి బయటకు రావాలి.
* ప్రభుత్వ విప్పు, తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం, కొమరాడ అక్టోబర్ 27. పెన్ పవర్.**ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ప్రభుత్వ విప్.కొమరాడ మండలం కెమిశిల గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సోమవారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి ప్రస్తుతం తుఫాను ఉన్న నేపథ్యంలో బయటకు వెళ్ళకూడదని స్కూల్లోనే జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# మొంథా తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.

-మాజీ మంత్రి తోట నరసింహం.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 27:**మొంథా తుఫాను ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట నరసింహం పిలుపునిచ్చారు. రాబోయే
మూడు రోజులు పాటు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాన్నారు.జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు నేను నా కుమారుడు తోట శ్రీ రాంజీ 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో ఉండవద్దని,పశు వులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలాన్నారు.విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని తాకవద్దన్నారు.
పాఠశాలలకు సెలవు కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా ఇళ్లల్లోనే ఉంచి రక్షించుకోవాలన్నారు.
వరి కోతలు, కుప్ప నూర్పులు రైతులు వాయిదా వేసుకోవాలన్నారు.
ముఖ్యంగా ఏలేరు పరివాహక ప్రాంత రైతులందరూ కూడా అప్రమత్తంగా ఉండాలి.
మత్స్యకారులు ఎవరూ కుడా వేటకు వెళ్ళవద్దని ప్రతి ఒక్కరికి సేవ చేయడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది అని పిలుపును ఇచ్చారు.

# తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు.




**రౌతులపూడి పెన్ పవర్ అక్టోబర్ 27.**ప్రతిపాడు నియోజకవర్గంలో విస్తృత పునరావాస ఏర్పాట్లు. తుఫాన్ ప్రభావం దృష్ట్యా ప్రతిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో, సంబంధిత అధికారుల సమన్వయంతో విస్తృత స్థాయిలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వర్షాలు, ఈదురు గాలులు, వరదల ప్రభావం వల్ల ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మాట్లాడుతూ,తుఫాన్ తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి ఆమె తెలిపారు. రౌతులపూడి మండలంలో 11 పునరావాస కేంద్రాలు, 8 జెసిబీలు, 5 ట్రాక్టర్లు, 8 జనరేటర్లు సిద్ధం చేశారు. ప్రజలకు త్రాగునీరు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు నిరంతరంగా అందించేందుకు అవసరమైన వనరులను సిద్ధంగా ఉంచాం అని తెలిపారు. విద్యుత్ అంతరాయం సంభవించినా గ్రామాల్లో త్రాగునీటి సరఫరా నిలిపిపోకుండా జనరేటర్లు, ట్రాక్టర్లు, జెసిబీలను సిద్ధంగా ఉంచినట్లు ఆమె చెప్పారు. రౌతులపూడి మండల వ్యాప్తంగా గుమ్మరేగుల ఎంపీపీఎస్ , బలరాంపురం జడ్పీపిహెచ్ఎస్, రౌతులపూడి జడ్పీహెచ్ఎస్, లచ్చిరెడ్డిపాలెం జడ్పీహెచ్ఎస్, శృంగవరం ఎంపీపీఎస్, రాజవరం ఎంపీపీఎస్, ఎన్ ఎన్ పట్నం ఎంపీపీఎస్, ఎస్ పైడిపాల ఎంపీయూపీ, పి రామవరం ఎంపీపీఎస్, గిడిజం ఎంపీయు పి, ఏ మల్లవరం ఎంపీయూపీ, ములుగుపూడి జెడ్ పి పి ఎస్, రాఘవపట్నం జిఏపిపిఎస్, ఎస్ అగ్రహారం జడ్ పిపిఎస్. ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు మరియు సౌకర్యాలను వినియోగించుకోవాలని, అవసరమైతే కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మొంథా తుఫాన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి.





జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్.

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 27:**మొంథా తుఫాను ప్రభావం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ పిలుపునిచ్చారు. మొంథా తుపాన్ నేపథ్యంలో కిర్లంపూడి మండలం భూపాలపట్నం, ఎస్ తిమ్మాపురం,ముక్కొల్లు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పలు సలహాలు సూచనలు అందజేశారు. రాబోయే
మూడు రోజులు పాటు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాన్నారు.జగ్గంపేట నియోజకవర్గ ప్రజలకు కూటమి ప్రభుత్వం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.. శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇళ్లల్లో ఉండవద్దని,పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలాన్నారు.విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటిని తాకవద్దన్నారు.
పాఠశాలలకు సెలవు కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా ఇళ్లల్లోనే ఉంచి రక్షించుకోవాలన్నారు.
వరి కోతలు, కుప్ప నూర్పులు రైతులు వాయిదా వేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏలేరు పరివాహక ప్రాంత రైతులందరూ కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆయన వెంట ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,ఎం పి పి, తోట రవి, సీనియర్ టిడిపి నాయకులు ఎస్ వి ఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు,తూము కుమార్, పలువురు టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ తీవ్ర తుఫానుగా మారే అవకాశం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : చిర్ల జగ్గిరెడ్డి

**కొత్తపేట, పెన్ పవర్,అక్టోబర్ 27:**
బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ వేగంగా తీవ్రతను పెంచుకుంటూ తీవ్ర తుఫానుగా మారుతున్న నేపథ్యంలో, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు.
తుఫాన్ ప్రభావం కారణంగా జిల్లాలో ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా రైతు సోదరులు తమ పొలాల వద్ద ఉన్న విద్యుత్ మీటర్లు, తీగల దగ్గరికి వెళ్లరాదని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని జగ్గిరెడ్డి సూచించారు.
తుఫాన్ కారణంగా ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించబడినందున, తల్లిదండ్రులు పిల్లలను బయటకు పంపకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పూరి గుడిసెల్లో లేదా బలహీనమైన ఇళ్లలో నివసించే ప్రజలు ప్రభుత్వం సూచించిన సురక్షిత కేంద్రాలకు తక్షణమే తరలిపోవాలని పిలుపునిచ్చారు.
ప్రజల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలని, అవసరమైతే వాటి ద్వారా సహాయం పొందాలని ఆయన సూచించారు.1996లో జిల్లాలో సంభవించిన



తుఫాన్ నష్టాలను గుర్తుచేసుకుంటూ, అప్పుడు ఎదురైన పరిస్థితులను పాఠంగా తీసుకుని ఈసారి మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.
"ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించే మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి. మనందరం కలిసి ఈ తుఫాన్‌ను సురక్షితంగా ఎదుర్కుందాం" అని వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి స్పష్టం చేశారు.

# శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి పోటేత్తిన భక్తులు.



**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:**పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి,శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.గ్రామంలో ప్రసిద్ధిగాంచిన ఈ దేవాలయాల్లో తెల్లవారుజామునుండే విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.వేద పండితులు ఆరాధ్యుల లక్ష్మీనరసింహమూర్తి శర్మ,సోమయాజుల భరత్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

# జగన్నాధపురంలో భారీ అన్న సమారాధన





**గోపాలపురం,పెన్ పవర్ అక్టోబర్ 27:**మండలంలోని జగన్నాధపురం గ్రామంలో ఊర చెరువు గట్టుపై ఉన్న శివాలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.సుమారు దశాబ్దకాలం కిందట గ్రామస్తులు,భక్తుల సహాయ సహకారాలతో ఈ ఆలయాన్ని నిర్మించి పండుగ వాతావరణం మధ్య ప్రారంభించారు.ఆనాటి నుండి నేటి వరకు ప్రతినిత్యం ఆలయంలోని పూజలు నిర్వహిస్తూనే ఉన్నారు.ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ఉదయం సాయంత్రం వేళల్లో భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపడుతున్నారు.కార్తీకమాస మొదటి సోమవారం కావడంతో భక్తులు గ్రామస్తుల సహాయ సహకారాలతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజ స్తంభానికి ఏర్పాటు చేసిన ఆకాశ దీపాన్ని అమర్చుతున్నారు.ఈ సందర్భంగా అయ్యప్ప మాలదార స్వాములతో పాటు భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# మొంథా తుఫాన్ పై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి-తహశీల్దార్ లావణ్య

**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 27:**మొంథా తుఫాన్ కారణంగా తాళ్ళపూడి తహశీల్దార్ లక్ష్మి లావణ్య మండలంలోని పలు సచివాలయాలను సందర్శించారు. మండల ప్రజలకు ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను, ప్రక్కిలంక సబ్ స్టేషన్ ను పరిశీలించారు. అదేవిధంగా తుఫాను కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం, అస్తి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని ప్రతీ గ్రామంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.






## వైసీపీ నేతల మధ్య గ్యాప్

**విజయవాడ, అక్టోబరు 27 పెన్ పవర్:** వైసీపీ అధినేత జగన్ కు పార్టీల నేతల మధ్య గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తుంది. వారి మధ్య సరైన అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. విశాఖ గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఈ విషయం మరొకసారి స్పష్టమయింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అవగాహన ఒప్పందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుదుర్చుకున్నారు. కానీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే వైసీపీ ఉత్తరాంధ్ర నేతలు మండిపడ్డారు. డేటా సెంటర్ తో ఉపయోగాలు లేవని, పర్యావరణానికి ముప్పు అని వైసీపీ నేతలు ప్రకటించారు. అదే సమయంలో నీరు,విద్యుత్తు అధికంగా వినియోగమవుతుందని చెప్పుకొచ్చారు.. అయితే వైఎస్ జగన్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో గూగుల్ డేటా సెంటర్ వల్ల ఉపయోగాలను పూసగుచ్చినట్లు చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల భవిష్యత్ లో అనేక ఉపయోగాలున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ వ్యాలీకి ఈ డేటా సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని జగన్ చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్ వల్ల వచ్చే ఉపాధి అవకాశాలు తక్కువని అన్నారు. భవిష్యత్ లో జరిగే మార్పునకు డేటా సెంటర్ ముఖ్య భూమిక అని జగన్ అన్నారు. రిక్రియేషన్ సెంటర్, ఐటీ పార్క్, స్కిల్ సెంటర్ పెట్టాలని నాడు అదానీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని జగన్ తెలిపారు. దీంతో వైసీపీ నేతలు డేటా సెంటర్ పై ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గాలిలో తేలిపోయినట్లయింది. డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటనను ప్రభుత్వం చేసిన వెంటనే హడావిడిగా వచ్చిన వైసీపీ నేతలు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టడమే పనిగా పెట్టుకున్నారు. అంతే తప్ప దాని వల్ల ఉపయోగాలను గురించి కనీసం ఆరా తీసే ప్రయత్నం చేయలేదు. గత ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాథ్ సయితం విమర్శలకు దిగారు. బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నేతలు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. డేటా సెంటర్ ను అమరావతిలో పెట్టుకోవచ్చు కదా? అని కూడా ప్రశ్నించారు. జగన్ విదేశాల నుంచి వచ్చి వైసీపీ నేతల ఆరోపణలకు విలువ లేకుండా చేశారు. దీంతో వైసీపీ అధినేతకు, నేతలకు మధ్య గ్యాప్ ఉందన్న విషయం మరోసారి బయటపడింది.

## బీహార్ లో ప్రచారానికి చంద్రబాబు, పవన్

**విజయవాడ, అక్టోబరు 27, పెన్ పవర్:**దేశంలో విచిత్ర రాజకీయ పరిస్థితి నడుస్తోంది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని అయ్యారు నరేంద్ర మోడీ. అయితే అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయంగా పోరాటం చేస్తోంది. చిన్న అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. అందుకే అక్కడ చెమటోడ్చుతుంది ఎన్డీఏ. అక్కడ గెలుపు ఏమంత సులువు కాదు కూడా. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఒక విధంగా చెప్పాలంటే బీహార్ ఎన్నికల వరకు ఒక ఎత్తు. దాని ఫలితాలు మరో ఎత్తు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలు తక్కువ. అదే ఇండియా కూటమిలో అయితే జాతీయస్థాయిలో చాలామంది నేతలు ఉన్నారు. ఇండియా కూటమి తరుపున ప్రచారం చేసేందుకు చాలామంది నేతలు క్యూ కడుతున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ గట్టి వ్యూహాలు రూపొందిస్తున్నారు.జాతీయస్థాయిలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా కేంద్ర రాజకీయాల్లో సుపరిచితుడు చంద్రబాబు. ఆపై మంచి పాలనా దక్షుడు అన్న పేరు తెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉంది. అందుకే బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చంద్రబాబును బిజెపి పెద్దలతో పాటు నితీష్ కుమార్ ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో ప్రచారం చేశారు చంద్రబాబు. అక్కడ తెలుగువారితో పాటు జాతీయస్థాయిలో చంద్రబాబు ప్రభావం చూపడంతో ఎన్డీఏ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణంతో తిరిగి వచ్చేసారు. ఇప్పుడు బీహార్ ప్రచారానికి వెళ్తున్నట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు.పవన్ కళ్యాణ్ సైతం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. గతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. సనాతన ధర్మం, హిందూ పరిరక్షణ విషయంలో పవన్ చర్యలను జాతీయస్థాయిలో హిందూ వాదులు గట్టిగానే సమర్థించారు. బీహార్లో సైతం పవన్ ప్రచారం చేస్తే హిందువులు గుంప గుత్తిగా ఎన్డీఏకు ఓటు వేస్తారని బిజెపి పెద్దల ఆలోచన. అయితే బిజెపి విషయంలో పవన్ ఎప్పుడు సానుకూలంగానే ఉంటారు. తప్పకుండా బిజెపి వినతిని పరిగణలోకి తీసుకొని బీహార్ ప్రచారంలోకి వెళ్తారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం బిజీగా ఉంది. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. దానికి ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు తరచూ విదేశాలకు వెళ్తున్నారు. వచ్చే నెల విశాఖ సదస్సు జరగనున్న దృష్ట్యా బిజీ గా ఉన్న తరుణంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లే అవకాశం ఉంది. దీనిపై అధికారిక షెడ్యూల్ రావాల్సి ఉంది.

## అమరావతికి చట్టభద్రత...

**గుంటూరు, అక్టోబరు 27, పెన్ పవర్:** ఏ రాజకీయ పార్టీకైనా ప్రజాభిప్రాయమే ఫైనల్. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా వెళితే ప్రతికూల ఫలితాలు తప్పవు. అయితే ఈ విషయంలో వెనక్కి తగ్గిన వారే ప్రజల మధ్య నిలబడగలరు. కానీ ఈ విషయంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొండిగా ముందుకు వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా అమరావతి రాజధాని నిర్మాణం పై ఆయన అభిప్రాయం మారలేదు. ఇటీవల ప్రెస్ మీట్ లో అమరావతిపై విముఖత చూపేలా మాట్లాడారు. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా గురించి చెప్పనవసరం లేదు. పేర్ని నాని లాంటి వ్యక్తి అయితే అమరావతిని ఉద్దేశించి చాలా తేలిగ్గా మాట్లాడారు. అమరావతి మునిగిపోతుందని ఒకరు.. అక్కడ పెట్టుబడి పెట్టడం వేస్ట్ అన్నట్టు మాట్లాడారు. చివరకు వైసిపి గెలిచిన జగన్ అమరావతి నుంచి పాలన సాగిస్తారన్న సకల శాఖ మంత్రి సజ్జలకు సైతం జగన్ క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. అమరావతి రాజధానిపై నాడు జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు కూడా మొన్నటి ఓటమికి ఒక కారణం. కానీ దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు జగన్మోహన్ రెడ్డి.2014, 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఆ రెండుసార్లుతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి వచ్చిన స్థానాలు చాలా తక్కువ. దానికి కారణం లేకపోలేదు. వ్యవసాయానికి సంబంధించి మూడు సాగు చట్టాలను తీసుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దేశవ్యాప్తంగా దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ప్రజల అసంతృప్తిని గమనించారు నరేంద్ర మోడీ. తాను ప్రవేశపెట్టిన సాగు చట్టాలపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయామని.. అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పి వెనక్కి తగ్గారు ప్రధాని మోదీ. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎప్పుడైతే సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారు కొంత సానుకూలత గా మార్చుకోండి బిజెపి. ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకోకుంటే మాత్రం బిజెపికి భారీ మూల్యం తప్పదుఅయితే మొన్నటి ఎన్నికల్లో జగన్ మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైసీపీ అమరావతిపై విషం చిమ్మడం మానలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టమైన సంకేతాలు పంపగలిగింది. ఇకమీదట అమరావతి రాజధానిని కదిలించలేరని తన చర్యల ద్వారా చెప్పింది. ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో నిర్మించాలని భావిస్తోంది. నాలుగు ఎకరాల భూమిని అమరావతిలో కొనుగోలు చేసింది. 12 కోట్ల రూపాయలు వెచ్చించి ఏపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని కొనుగోలు చేసింది రిజర్వ్ బ్యాంక్. అన్ని ఆలోచించి రిజర్వ్ బ్యాంక్ ఈ నిర్ణయానికి వచ్చింది. కచ్చితంగా అమరావతిని కేంద్రం చట్టబద్ధత చేస్తుందని తెలిసి ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రిజర్వ్ బ్యాంక్ పరిధిలో పనిచేసే 12 ప్రాంతీయ బ్యాంకుల సైతం తమ ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి. ఈ నెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ఈ ఆర్థిక రంగ బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు జరుగుతుంది. అంటే త్వరలో పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించనుందన్నమాట.

## కూటమి సర్కార్ లోనూ ఫ్యాన్ నేతలు చక్రం




**రాజమండ్రి, అక్టోబరు 27 పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేడు నెలలవుతుంది. అయితే ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నది వైసీపీ నియమించిన వారేనట. ఈ మాటలన్నది ఎవరో కాదు. స్వయానా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రతి జిల్లాలో తన మనుషులను నియమించుకున్నాని, వారే జిల్లాల్లో ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాలోనూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది గత ప్రభుత్వ హయాంలో కొడాలి నాని వద్ద ఉన్న ఒక వ్యక్తి అని, అతనే ఇప్పుడు కేశినేని చిన్ని కార్యాలయంలో కూర్చుని ఈ మాఫియాను నడుపుతున్నారని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు రాష్ట్ర రాజకీయాలపై ఒక అవగాహన ఉందని అంటున్నారు. అందుకే ఆయన చేసిన ఆరోపణలను ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వైసీపీ నేతల మనుషులే రేషన్ బియ్యం మాఫియాను నడుపుతుండటం సిగ్గుచేటని కామెంట్స్ పెడుతున్నారు. వైసీపీ నేతలను అరెస్ట్ చేయాల్సిందిబోయి వారిని అక్కున చేర్చుకోవమేంటని టీడీపీ అభిమానులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రతి జిల్లాలో ఒక మనిషిని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నియమించుకున్నారని, వారి ద్వారా రేషన్ డీలర్ల ను బెదిరించి ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపై ఇప్పుడు జనసేనకు కూడా చుట్టుకుంది. జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలు నాదెండ్లకు ఆగ్రహాన్ని తెప్పించాయి. తాజాగా కొలికపూడి చేసిన వ్యాఖ్యలతో ఆయన మరింత కోపానికి గురయినట్లు తెలిసింది. మొత్తం మీద కూటమిలో ఇప్పటికీ వైసీపీ నేతల హవా నడుస్తుందన్న కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో మంటలు రేపుతున్నాయి. చంద్రబాబు వచ్చిన తర్వాత దీనికి ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు.

## కాకినాడ నుంచి నక్కపల్లికి బల్క్ డ్రగ్స్

**విజయనగరం, అక్టోబరు 27 పెన్ పవర్:**
మన దేశ ఔషధ రంగ భవిష్యత్‌ను పూర్తిగా మార్చే సత్తా ఉన్న మెగా ప్రాజెక్టు ఈ బల్క్‌డ్రగ్ పార్క్. కరోనా సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కోవిడ్ టైంలో అసలు మాస్కలను కూడా భారీగా ఉత్పత్తి చేయలేని మన వైద్యరంగం ఉండేది. భవిష్యత్‌లో వైద్యపరంగా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా దేశంలో అతి పెద్ద బల్క్‌డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని భావించింది. దీని కోసం దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ మూడు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు నచ్చిన కేంద్రం వారికి ఆ అవకాశం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో ఈ డ్రగ్‌పార్క్‌లు ఏర్పాటుకు అంగీకరించింది. ఏడాదిన్నర లోపు ఈ డ్రగ్ పార్క్ మొదటి విడత ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవాంతరాలు కారణంగా ఇప్పటి అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయింది. ఈ ప్రాజెక్టు చేజారిపోకుండా వచ్చే మార్చి నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ప్రభుత్వం ఫైనల్ గడువు ఇచ్చి పనులు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన బల్క్ డ్రగ్స్ పార్క్‌ను విశాఖపట్నం సమీపంలోని నక్కపల్లి వద్ద ఏర్పాటుకు ప్రభుత్వాలు అంగీకరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దీన్ని దాదాపు 2000 ఎకరాల విస్తీర్ణంలో 1876 కోట్ల తో దీన్ని నిర్మించనున్నారు. ఇది కేవలం ఔషధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఇది ప్రతిబింబం. ఈ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, దాని ప్రత్యేక విలువ, భారతీయ ఫార్మా పటంలో నక్కపల్లిని నిలపనున్నాయి. బల్క్‌డ్రగ్ పార్క్ అంటే చాలా మందికి ఒక పెద్ద ఫ్యాక్టరీ లేదా ఫార్మా సిటీలా అనిపిస్తుంది. కానీ దాని ప్రాముఖ్యత అంతకు మించి ఉంటుంది. అసలు మెడిసిన్ పని చేయడానికి గల ప్రధాన కారణం అందులో ఉండే బల్క్‌డ్రగ్ లేదా యాక్టివ్‌ఫార్మస్యూటికల్ ఇంగ్రిడియంట్. ఒక టాబ్లెట్‌లో మందు చాలా తక్కువ మోతాదులో ఉంటుంది కానీ ఆ టాబ్లెట్ ఆకారం, రుచి, అన్ని వాతావరణాలకు తట్టుకునేలా ఉండేందుకు మరికొన్ని పదార్థాలు కలుపుతారు. ఈ బల్క్‌డ్రగ్స్‌ను పెద్ద ఫ్యాక్టరీలలో రసాయనిక చర్యల ద్వారా తయారు చేస్తారు. వాటిని శుద్ధి చేసి, నాణ్యత పరీక్షించిన తర్వాతే, మందులు తయారు చేసే కంపెనీలకు పంపిస్తారు. ఈ కంపెనీలకు ఫార్ములేషన్ ప్లాంట్స్ అంటారు. ఈ ఫార్ములేషన్ ప్లాంట్స్‌లో ఈ బల్క్ డ్రగ్స్‌ను ఇతర పదార్థాలతో కలిపి టాబ్లెట్లు, సిరప్‌లు క్యాప్సూల్స్‌గా మారుస్తారు. ఈ బల్క్ డ్రగ్స్ లేకపోతే మెడిసిన్ తయారు చేయడం అసాధ్యం. అందుకే, ఈ కీలకమైన ముడి పదార్థాల ఉత్పత్తిని ఒకే చోట కేంద్రీకృతంచేసి, అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటు చేసేదే బల్క్ డ్రగ్ పార్క్. నక్కపల్లిలో ఈ భారీ ప్రాజెక్టును ఇప్పుడే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనే ప్రశ్న వస్తుంది. దీనికి ప్రధాన కారణం కోవిడ్. 2019లో కరోనా మహమ్మారికి ముందు వరకు, భారతదేశం తన బల్క్ డ్రగ్ అవసరాలలో అధిక భాగాన్ని చైనా నుంచి దిగుమతి చేసుకునేది. అయితే కోవిడ్ సమయంలో చైనా నుంచి దిగుమతులు పూర్తిగా తగ్గిపోవడం, సరఫరా చైన్ తెగిపోవడం వల్ల మనం దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ సంక్షోభమే తర్వాతే, మన దేశంలోనే ఎందుకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేయకూడదు అనే ఆలోచనకు భారత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పార్క్ నక్కపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో భాగం. ఇది విజయవాడ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖపట్నం–కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో ఉంది. రాజయ్యపేట, బుచిరాజుపేట, చందనాడ, వెంపాడు, డోనివాని లక్ష్మీపురం గ్రామాల్లో విస్తరించి ఉంది. ఈ డ్రగ్స్ పార్క్ కోసం సౌత్ ఇండియాలో చాలా రాష్ట్రాల్లో తీవ్రంగా పోటీ పడ్డాయి. మొదట్లో ఈ పార్కును కాకినాడలో ఏర్పాటు చేయాలని భావించారు. నక్కపల్లి వద్ద భూమి సిద్ధంగా ఉందని అక్కడికి తరలించారు. నక్కపల్లిలో ఈ పార్క్ ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయి. రవాణా సౌకర్యం:– నేషల్ హైవేకు 16కు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

రైల్వే కనెక్టివిటీ కూడా ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎగుమతి దిగుమతులకు ఈ రైలవే లైన్ ఉపయోగపడుతుంది.

పోర్టులు కూడా దగ్గరే:– గంగవరం పోర్టుకు చాలా దగ్గరగా ఉంది. విశాఖపట్నం పోర్టుకు 70 కిలోమీటర్లు, కాకినాడ పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటం దీనికి ఉన్న ప్రత్యేకత. వీటి కారణంగా ఉత్పత్తులు, ముడిసరకులు రవాణా మరింత సులభం అవుతుంది.

విద్యుత్%ఢ% నీటి సౌకర్యాలు:– పారిశ్రామిక అవసరాల కోసం ప్రత్యేకమైన ఇండస్ట్రీయల్ పవర్ గ్రిడ్ ఉంది. భవిష్యత్‌లో పునరుత్పాదక ఇంధనం వనరులను కూడా దీనికి అనుసంధానం చేస్తారు. రసాయన పరిశ్రమలకు అత్యవసరమైన నీటి సరఫరా కోసం ఏలూరు కాలువ ఉండనే ఉంది.

ఫార్మా ఎకో సిస్టమ్:– ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న హెటెరో దివిస్ ల్యాబ్స్, లాల్స్ ల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇవి ఈ బల్క్ డ్రగ్స్ పార్క్‌లో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నక్కపల్లి ప్రాజెక్ట్ ఖర్చు ?1,876.66 కోట్లుగా అంచనాలు వేస్తున్నారు. జనవరి 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ?1000 కోట్ల గ్రాంట్ అందిస్తోంది, మార్చి 2023లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ?225 కోట్లు విడుదల కూడా చేసింది. ఈ బీపీడీ మూడు ప్యాకేజీలుగా విభజించారు. వాటికి టెండర్లు పిలిచారు. వర్క్ నడుస్తున్నాయి. ప్యాకేజీ 1లో రోడ్లు, డ్రైన్లు, సరిహద్దు గోడలు, గ్రీన్ ఏరియా డెవలప్‌మెంట్, నీటి సరఫరా, రీసైకిల్ వాటర్ సరఫరా, వేస్ట్ వాటర్ సిస్టమ్, పవర్ సప్లై, ఎమర్జెన్సీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ట్రక్ టెర్మినల్స్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి పనులు ఉంటాయి. ప్యాకేజీ 2లో కామన్ ఎఫ్లియెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్, మెరిన్ అవుట్‌ఫాల్ సిస్టమ్ ఈ పనులు వ్యర్థ జలాలు శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా చూస్తారు. ప్యాకేజీ 3లో స్టీమ్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, కామన్ సాల్వెంట్ రికవరీ సిస్టమ్ పనులు పూర్తి చేస్తారు.

శరవేగంగా పనులు

ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎనహెచ్ 16 నుంచి ఎన్‌ఐఏకు 4.5 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. పార్క్ కోసం సేకరించిన రెండు వేల ఎకరాల భూమి మొత్తం ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. భవిష్యత్ విస్తరణ కోసం అదనంగా 723.2 ఎకరాలు కేటాయించారు. ఇందులో పరిశ్రమలకు 1900 ఎకరాలను కేటాయిస్తారు. సౌకర్యాల కోసం 70 ఎకరాలు ఇస్తారు. పార్కింగ్, లాజిస్టిక్ అవసరాల కోసం 120 ఎకరాలు, మిగిలిన భూమిని యుటిలిటీలు, ఓపెన్ స్పేస్, వాటర్ బాడీ, గ్రీన్ బెల్ట్, రోడ్ల కోసం కేటాయిస్తారు. మొత్తం సేకరించిన భూమిలో కేవలం 57.90 శాతం విక్రయించడానికి వీలుగా ఉంటే మిగిలిన ప్రాంతాన్ని యుటిలీలు, ఓపెన్ స్పేస్, రోడ్లకు కేటాయిస్తారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందించి ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పెట్టుబడిదారులు కోర్ ఉత్పత్తిపై దృష్టి పెడతారు. ఇది పెట్టుబడి, ఆపరేటింగ్ ఖర్చును 15–20 శాతం వరకు తగ్గిస్తుంది. అంతే కాకుండా 2033–34 నాటికి 27 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తుంది.

## మరో బాంబు పేల్చిన కొలికపూడి



**విజయవాడ, అక్టోబరు 27, పెన్ పవర్:**కూటమిలో ఇప్పుడు కొలికపూడి కాక రేపుతున్నారు. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వర్సెస్ కొలికపూడి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే తాజాగా కొలికపూడి సంచలన అంశాలను బయటపెట్టారు. ఇప్పటికీ కూటమిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోందని.. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కూటమికి నష్టం అని తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు జరిగింది ఒక ఎత్తు. ఇప్పుడు కొలికపూడి చెబుతోంది మరో ఎత్తు. ఆయనను అంత తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. ఎంతోమందికి పొలిటికల్ సైన్స్ పాఠాలు చెప్పి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దిన ఘనత కొలికపుడిది. ఇప్పటివరకు ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లైన్లో మాట్లాడుతున్నారని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అదే వైసీపీ మనుషులు కూటమి పార్టీలో ఉన్నారని సంచలన విషయాలను బయటపెట్టారు. ఇప్పుడు అవే హాట్ టాపిక్ అవుతున్నాయి.

ఇప్పటివరకు ఆయన పై హై కమాండ్ చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. కానీ ఇప్పుడు హై కమాండ్ కె కొలికపూడి సూచనలు ఇస్తుండడం విశేషం.వైసీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్. ఆయనది స్వతహాగా బియ్యం వ్యాపారం. అయితే రేషన్ మాఫియా నడుపుతున్నది ఆయనేనని ఆరోపణలు ఉన్నాయి. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ఆయనపై విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇంతవరకు ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. మొన్న ఆ మధ్యన కాకినాడలో ఒక షిప్ దొరికిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే ద్వారంపూడి చంద్రశేఖర్ పేరు బలంగా వినిపించింది. ఆయనపై ఎటువంటి కేసులు నమోదు కాలేదు. చర్యలు కూడా తీసుకోలేకపోయారు. తాజాగా కొలికపూడి ద్వారంపూడి చంద్రశేఖర్ మనుషులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని.. వారే రేషన్ బియ్యం మాఫియా ను నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు.. ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో కూర్చొని దందాను నడుపుతున్నారంటూ కొలికపూడి వ్యాఖ్యానించడం విశేషం.ఎంపీ కేశినేని చిన్ని తన పేరు కొలికపూడి బయట పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అసెంబ్లీ టికెట్ కోసం తన వద్ద ఐదు కోట్ల రూపాయలు తీసుకున్నారంటూ ఆరోపించారు కొలికపూడి. అక్కడ నుంచి వివాదం ప్రారంభం కాగా నిన్ననే కూటమి సమన్వయ సమావేశం పేరిట బలప్రదర్శనకు దిగారు చిన్ని. దాదాపు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు కీలక నేతలంతా హాజరయ్యారు. అయితే ఇప్పుడు కొత్త విషయాన్ని బయటపెట్టారు కొలికపూడి. కొడాలి నాని మనుషులు కేశినేని చిన్ని కార్యాలయంలో ఉండడాన్ని హైలెట్ చేశారు. ద్వారంపూడి చంద్రశేఖర్ మనషులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని చెప్పడం ద్వారా పౌర సరఫరాల శాఖను తప్పుపట్టారు. ఆ శాఖను నిర్వర్తిస్తోంది జనసేన నేత నాదెండ్ల మనోహర్. తద్వారా చిన్ని కూటమి ద్వారా తనను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అదే కూటమిని ఇరకాటంలో పెట్టగలిగారు కొలికపూడి. రాజకీయంగా బద్ధ శత్రువుగా ఉన్న కొడాలి నాని మనిషిని తెచ్చుకొని.. కేశినేని చిన్ని అవినీతికి పాల్పడుతున్నారని చెప్పడంలో సక్సెస్ అయ్యారు కొలికపూడి. దీంతో ఈ వివాదం యూటర్న్ తీసుకుంది. ముమ్ముందు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

## కోహ్లీ, రోహిత్ మళ్ళీ గ్రౌండ్‌లో కనిపించేది అప్పుడే ..
## 2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్ తో టీమిండియా స్టార్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఫామ్ పై ఉన్న ఆందోళనలు తొలగిపోయాయి. రోహిత్ శర్మ అద్భుతంగా ఆడి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకోగా .. తొలి రెండు వన్డేల్లో డకౌటైనా సిడ్నీ వన్డేలో హాఫ్ సెంచరీ చేసి కోహ్లీ మంచి టచ్ లో కనిపించాడు. కేవలం ఒకటే ఫార్మాట్ ఆడడంతో వీరి ఆట కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదరు చూస్తున్నారు. కోహ్లీ, రోహిత్ వన్డేల్లో మాత్రమే కనిపించనుండడంతో వీరి నెక్స్ట్ షెడ్యూల్ ఎప్పుడు అని అభిమానులు ఆరాటపడుతున్నారు.

2027 వన్డే వరల్డ్ కప్ వరకు రోకో జోడీ ఆడాడతారని దాదాపుగా కన్ఫర్మ్ అయింది. ఏడు నెలల తర్వాత బరిలోకి దిగినా వీరిద్దరూ తమ ఫామ్ ను కొనసాగించి విమర్శకులకు సమాధానమిచ్చారు. 2027 వన్డే వరల్డ్ కప్ లోపు ఇండియా మొత్తం 21 వన్డే మ్యాచ్ లు ఆడనుంది. ఇందులో భాగంగా మొదట సౌతాఫ్రికాతో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ జరగనుంది. నవంబర్ 30 న తొలి వన్డే.. డిసెంబర్ 3 న రెండో వన్డే.. డిసెంబర్ 6 న మూడో వన్డే జరుగుతుంది. తొలి మూడు వన్డేలకు వరుసగా రాంచీ, రాయ్‌పూర్,విశాఖపట్నం ఆతిథ్యమిస్తాయి. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ ముగిశాక ఇండియా వన్డే షెడ్యూల్ ఏంటో ఇప్పుడు చూద్దాం..

**2027 వరల్డ్ కప్ ముందు టీమిండియా వన్డే షెడ్యూల్:**

2025 నవంబర్,డిసెంబర్ లో దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆడనుంది.

2026 జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్. ఈ ఇండియాలో ఈ సిరీస్ జరుగుతుంది.

2026 జూన్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల సిరీస్

2026 జూలైలో ఇంగ్లాండ్‌తో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ (విదేశాల్లో)

2026 సెప్టెంబర్, అక్టోబర్ లో వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

2026 అక్టోబర్, నవంబర్‌లో మూడు వన్డేల సిరీస్ న్యూజిలాండ్ లో జరగనుంది.

2026 డిసెంబర్ లో శ్రీలంకతో స్వదేశంలో మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్

**రోహిత్ సూపర్ హిట్.. కోహ్లీ ఫ్లాప్:**

ఆస్ట్రేలియాతో ఇటీవలే ముగిసిన మూడు మ్యాచ్ ల వన్డే సిరీస్ లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. తొలి వన్డేలో విఫలమైనా రెండో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి రాణించాడు. సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో చెలరేగుతూ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఓవరాల్ గా ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు. మరోవైపు కోహ్లీ తొలి రెండు వన్డేల్లో డకౌటై తీవ్రంగా నిరాశపరిచాడు. అయితే మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసి టచ్ లోకి వచ్చాడు.

## కంబ్యాక్ అంత ఈజీ కాదు: కోహ్లీ బాటలోనే కేన్ మామ..
# 9 ఏళ్ళ తర్వాత వన్డేల్లో విలియంసన్ డకౌట్

**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ లో విరామం తర్వాత తొలి మ్యాచ్ లోనే రాణించడం ఈజీ కాదని మరోసారి రుజువైంది. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ లో కోహ్లీ, రోహిత్ ఏడు నెలల తర్వాత తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడితే ఇద్దరూ విఫలమయ్యారు. రోహిత్ సింగిల్ డిజిట్ కే పరిమితం కాగా.. కోహ్లీ డకౌటయ్యాడు. ఇప్పుడు వీరిద్దరి దారినే న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియంసన్ అనుసరించాడు. సుదీర్ఘ విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టిన విలియంసన్ కు నిరాశే మిగిలింది. ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్ లో రీ ఎంట్రీ ఇచ్చిన కేన్ తన తొలి మ్యాచ్ లో డకౌట్ గా వెనుదిరిగాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత తొలి వన్డే ఆడిన ఈ కివీస్ దిగ్గజ క్రికెటర్ తొలి బంతికే బ్రైడాన్ కార్స్ బౌలింగ్ లో గోల్డెన్ డక్ ఔటయ్యాడు. కార్స్ వేసిన ఎక్స్ ట్రా బౌన్స్ ఆడే క్రమంలో విలియంసన్ బ్యాట్ అంచుకు బ్యాట్ తగిలి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. చివరిసారిగా 2016లో వన్డే క్రికెట్ లో ఆస్ట్రేలియాపై డకౌటైన ఈ కివీస్ స్టార్ 9 సంవత్సరాల తర్వాత పరుగుల ఖాతా తెరవకుండా పెవిలియన్ చేరాడు. ఈ ఏడాది ప్రారంభంలో ఇండియాపై ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడిన కేన్.. 7 నెలల తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం.

**సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకున్న విలియంసన్:**

న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కేన్ వద్దనుకున్నారు. ఒకవేళ ఈ కాంట్రాక్ట్ లిస్ట్ లో ఉంటే జాతీయ జట్టు తరపున రెగ్యులర్ ప్లేయర్ గా ఆడాల్సి ఉంటుంది. విలియంసన్ మాత్రం అంతర్జాతీయ టీ20 క్రికెట్ లీగ్ లు ఆడాలనే తన కోరికను తెలిపాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్ లో లేకపోయినా ప్రధాన టోర్నీలకు అందుబాటులో ఉంటానని గతంలోనే కేన్ స్పష్టం చేశాడు. విలియంసన్ టీ20 వరల్డ్ కప్ 2026 ఆడతాని ప్రకటించడంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న ఐసీసీ టోర్నీలో ఫిట్ గా ఉండేందుకు తాను ఈ నిర్ణయం తీసుకున్నానని ఈ కివీస్ దిగ్గజం చెప్పినా ద్వైపాక్షిక సిరీస్ పై




ఆసక్తి చూపించడం లేదు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ బోణీ చేసింది. లక్ష్య ఛేదనలో డారిల్ మిచెల్ (78 నాటౌట్), మైకేల్ బ్రాస్‌వెల్ (51) హాఫ్ సెంచరీలతో రాణించడంతో.. ఆదివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఫలితంగా సిరీస్‌లో 1%-%0 లీడ్‌లో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (101 బాల్స్‌లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 135) సెంచరీతో చెలరేగినా మిగతా బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు.జెమీ స్మిత్ (0), బెన్ డకెట్ (2), జో రూట్ (2), జాకబ్ బెథెల్ (2), బట్లర్ (4), సామ్ కరన్ (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బ్రూక్, జెమీ ఓవర్టన్ (46) ఏడో వికెట్‌కు 87 రన్స్ జోడించారు. ఛేజింగ్‌లో కివీస్ 36.4 ఓవర్లలో 224/6 స్కోరు చేసి నెగ్గింది. విల్ యంగ్ (5), రచిన్ రవీంద్ర (17), కేన్ విలియమ్సన్ (0) ఫెయిలయ్యారు. టామ్ లాథమ్ (24), మిచెల్ శాంట్నర్ (27) పర్వలేదనిపించారు. బ్రైడన్ కార్సీ 3 వికెట్లు తీశాడు. బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం హామిల్టన్‌లో జరుగుతుంది.

# టీమిండియాతో టెస్టు సిరీస్ కు దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌తో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా తమ జట్టును ప్రకటించింది. గాయం కారణంగా గత కొంతకాలంగా జట్టుకు దూరమైన టెంబా బవుమా, కెప్టెన్‌గా పునరాగమనం చేశాడు. ఈ సిరీస్‌లోని తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో ప్రారంభం కానుంది. ఇటీవలే పాకిస్థాన్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు బవుమా పిక్క కండరాల గాయం కారణంగా దూరమయ్యాడు. అతని గైర్హాజరీలో ఐడెన్ మార్క్రమ్ జట్టుకు నాయకత్వం వహించగా, ఆ సిరీస్‌ను సఫారీ జట్టు 1-1తో డ్రా చేసుకుంది. తాజాగా ప్రకటించిన జట్టులో డేవిడ్ బెడింగ్‌హామ్ స్థానంలో బవుమాను ఎంపిక చేశారు. భారత పర్యటనలో స్పిన్ కీలక పాత్ర పోషించనుండటంతో దక్షిణాఫ్రికా తమ జట్టులో కేశవ్ మహారాజ్, సైమన్ హార్మర్, సెనురన్ ముత్తుస్వామి వంటి స్పిన్నర్లకు ప్రాధాన్యం ఇచ్చింది. పేస్ విభాగంలో కగిసో రబాడతో పాటు ఆల్‌రౌండర్లు కార్బిన్ బాష్, మార్కో యన్సెన్, వియాన్ ముల్డర్ ఉన్నారు.ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు నవంబర్ 14న కోల్‌కతాలో, రెండో టెస్టు నవంబర్ 22న గౌహతిలోని ఏసీఏ స్టేడియంలో జరగనుంది. గౌహతి మైదానానికి ఇదే తొలి టెస్ట్ మ్యాచ్ కావడం విశేషం. ఈ పర్యటనకు ముందు, నవంబర్ 2 నుంచి బెంగళూరు వేదికగా జరిగే భారత్ 'ఏ' జట్టుతో సిరీస్‌లో కూడా బవుమా ఆడనున్నాడు. ఇదే సిరీస్‌లో టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా పాదం గాయం నుంచి కోలుకుని తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు.

జట్టు ఎంపికపై దక్షిణాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి కాన్రాడ్ మాట్లాడుతూ, "పాకిస్థాన్‌తో సిరీస్‌లో ఆడిన జట్టులోని చాలా మంది ఆటగాళ్లను కొనసాగించాం. వారు అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించి సిరీస్‌ను డ్రాగా ముగించారు. భారత్‌లో కూడా మాకు అలాంటి కఠిన సవాలే ఎదురవుతుందని భావిస్తున్నాం. పాక్‌లో రాణించిన ఆటగాళ్లు ఇక్కడ కూడా కీలకం కానున్నారు. ఇది కచ్చితంగా జట్టు సమష్టి కృషితోనే సాధ్యమవుతుంది" అని వివరించారు.

**భారత్‌తో టెస్టులకు దక్షిణాఫ్రికా జట్టు:**

టెంబా బవుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రమ్, ర్యాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైల్ వెర్రెయిన్, డెవాల్డ్ బ్రెవిస్, జుబేర్ హమ్జా, టోనీ డి జోర్జి, కార్బిన్ బాష్, వియాన్ ముల్డర్, మార్కో జాన్సెన్, కేశవ్ మహారాజ్, సెనురాన్ ముత్తుస్వామి, కగిసో రబాడ, సైమన్ హార్మర్.

# గ్యాంగ్‌స్టర్‌గా సవాల్‌ను స్వీకరిస్తాడా?




సత్య .. గ్యాంగ్ స్టర్ .. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్ ..ఇంకా చాలా గ్యాంగ్ స్టర్ డ్రామాలు బాలీవుడ్ లో వచ్చాయి. ఇవన్నీ వేటికవే ప్రత్యేకం అని నిరూపించాయి. ఈ సినిమాల్లో నటీనటుల ప్రదర్శనలు పరాకాష్టలో మెప్పించాయి. అందుకే ఇప్పుడు మరోసారి గ్యాంగ్ స్టర్ డ్రామాను ఎంపిక చేసుకుంటే, దానిలో ప్రధాన పాత్రధారి కొత్తదనం, వైవిధ్యం ప్రదర్శించడంలో సత్తా చాటాల్సి ఉంటుంది. షారూఖ్ డాన్ లో అండర్ వరల్డ్ కింగ్ గా నటించి మెప్పించాడు. ప్రస్తుతం సిద్ధార్థ్ ఆనంద్ - కింగ్ - చిత్రంలో మరోసారి మాఫియా డాన్ గా నటిస్తున్నాడు.

ఇలాంటి సమయంలో ఒక నవతరం హీరో అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా, పరిణతి చెందిన డాన్‌గా భిన్నమైన షేడ్స్ లో నటించాలంటే చాలా సవాళ్లను స్వీకరించాలి. నటనలో కొత్తదనం చూపించాలి. కథ, కథనంలో మేకర్స్ కొత్తదనం ఆవిష్కరించాలి. ముఖ్యంగా ఎమోషన్స్ ని కనెక్ట్ చేసే ఎలిమెంట్స్ ని జోడించాల్సి ఉంటుంది. ఎక్కడ ఏది సింక్ కాకపోయినా అది మిస్ ఫైర్ అవ్వడం ఖాయం.

కానీ ఇలాంటి ఒక సవాల్ ని స్వీకరించేందుకు నవతరం హీరో హర్షవర్ధన్ రాణే సిద్ధమవుతున్నాడు. అతడు ఇప్పటివరకూ రొమాంటిక్ కామెడీలతో ఆకట్టుకున్నాడు. సనమ్ తేరి కసమ్, ఏక్ దీవానే కి దీవానియాత్ చిత్రాలతో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్నాడు రాణే. ఈ రెండు చిత్రాలు ప్రేమకథలు.. రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్ నేపథ్యంలో రక్తి కట్టించాయి. కానీ ఇప్పుడు హర్షవర్ధన్ పూర్తిగా ఒక భిన్నమైన ప్రపంచంలోకి అడుగుపెట్టాల్సి ఉంటుంది. అండర్ వరల్డ్ మాఫియా పాత్ర అతడికి పూర్తిగా కొత్త. ఇది ఒక సవాల్.

ఇది తన కెరీర్ లో ఒక సాహసంగానే చూడాలి. డాన్ పాత్రలో మునుపెన్నడూ చూడని కొత్తదనాన్ని చూపించేందుకు అతడు చాలా శ్రమించాల్సి ఉంటుంది. ఒక రొటీన్ ప్రేమికుడిగా లేదా భగ్న ప్రేమికుడిగా కనిపించినంత సులువుగా డాన్ పాత్రలోకి ఒదిగిపోవడం కుదరదు. కానీ నటుడిగా కొత్త దశకు చేరాలంటే ఇలాంటి ఒక ప్రయత్నం చేయాలి. హర్షవర్ధన్ రొటీన్ కి భిన్నంగా ఒక డాన్ గా ఎలా పరివర్తన చెందుతాడో వేచి చూడాలి. ఈ ప్రతిష్ఠాత్మక గ్యాంగ్ స్టర్ డ్రామాను బాలాజీ టెలీఫిలింస్ అధినేత్రి ఏక్తాకపూర్ నిర్మించనున్నారు. ఒక అన్ నోన్ ప్రపంచం నుంచి అండర్ వరల్డ్ లోకి ప్రవేశించే యువకుడి భావోద్వేగాలను వెండితెరపైకి తీసుకు రావాలనే ప్రయత్నమిది. ఇది ఒక రకంగా ఆర్జీవీ సత్య స్టోరి లైన్ ని పోలి ఉంటుంది. కానీ ఇప్పుడు దానికి మించి మోడ్రన్ యుగపు డాన్‌గా హర్షవర్ధన్ పరిణతి చెందిన నటనను కనబరచాల్సి ఉంటుంది. తనకు సంబంధం లేకుండానే అండర్ వరల్డ్ లో ప్రవేశించే యువకుడిగా హర్షకు నటించేందుకు ఎక్కువ స్కోప్ ఉంది. కానీ అతడు ఏం చేస్తాడో వేచి చూడా.

హర్షవర్ధన్ తదుపరి %-%సిలా%-% చిత్రంలో సాదియా ఖతీబ్, కరణ్ వీర్ మెహ్రాతో కలిసి కనిపిస్తాడు. ఆ తర్వాత ఏక్తాకపూర్ నిర్మించే గ్యాంగ్ స్టర్ డ్రామా కోసం ప్రిపేర్ అవుతాడు. భూమిక నిర్మించిన తెలుగు సినిమా తకిట తకిట నుంచి హర్షవర్ధన్ రాణే ప్రయాణం ఆసక్తికరం. అతడు బాలీవుడ్ లో పెద్ద స్టార్ గా తనను తాను ఆవిష్కరించుకునే సమయంలో ఇది అద్భుత అవకాశం.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com